మొక్కల పెంపకంపై అటకెక్కిన విచారణ

- అధికారులను కాపాడే యత్నాలు?



సాగర్‌నగర్‌లో మొక్కలు నాటిన ప్రాంతం

విశాఖపట్నం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సాగర్‌నగర్ బీచ్‌లో 25 ఎకరాల విస్తీర్ణంలో ఏడాది క్రితం నాటిన సరుగుడు మొక్కల పెంపకంలో అక్రమాలపై చేపట్టిన విచారణ అటకెక్కింది. ఫారెస్టు రేంజర్‌తోపాటు విజిలెన్స్, స్క్వాడ్ విభాగాలు పూర్తిస్థాయి విచారణ చేపట్టలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గుడ్లవానిపాలెం ఫారెస్టుబ్లాక్ పరిధి సాగర్‌నగర్ బీచ్‌లో 25 ఎకరాల్లో గత ఏడాది 25 వేల సరుగుడు మొక్కలు నాటారు. వాటి సంరక్షణ చర్యల్లో అధికారులు విఫలమయ్యారనే విమర్శలున్నాయి. మొక్కల పెంపకానికి అవసరమైన నీటి కోసం అక్కడే బోర్లు తవ్వకుండా ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయడంలో పెద్దఎత్తున అవినీతి జరిగిందనే వాదన ఉంది. మొక్కలకు సకాలంలో నీటిని అందించకపోవడంతో సగానికిపైగా చచ్చిపోగా మిగిలిన వాటికి రక్షణ కల్పించలేదు. వాటి చుట్టూ ఏర్పాటుచేసిన ఫెన్సింగ్ కూడా నాసిరకంగా ఉంది. గతంలో వినియోగించిన ఫెన్సింగ్ వైర్లు, పోల్స్ వేశారు. అది కూడా బైండింగ్ వైరు వేయడంతో తుప్పుపట్టింది. దీనిపై అక్టోబరు 29న 'మొక్కల పేరుతో మెక్కేశారు' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమవడంతో ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించారు. దీనిపై రేంజర్ శాస్త్రి విచారణ చేపట్టారు. నివేదిక ఇప్పటి వరకూ ఇవ్వలేదని తెలిసింది. లోతుగా విచారణ చేపడితే మొక్కలు నాటే సమయంలోని అధికారుల మెడకు చుట్టుకుంటుంది. అటవీశాఖలో విజిలెన్స్ స్క్వాడ్ విభాగాలు కూడా సాగర్‌నగర్‌లోని సరుగుడు మొక్కలను పరిశీలించినా నివేదిక ఇవ్వలేదు. కాగా విచారణ ముందుకుసాగకుండా ఉన్నతస్థాయిలో ఒత్తిళ్లు వస్తున్నాయన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

భూ కబ్జాదారులపై ఉక్కుపాదం!

విశాఖపట్నం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి):

'ప్రభుత్వ భూములు దోచుకున్న, ఆక్రమించుకున్న వారిపై ఉక్కుపాదం మోపుతాం. ఆక్రమణలకు సహకరించిన అధికారులపై క్రిమినల్ కేసులు నమోదుచేస్తాం. అభియోగాలు ఎదుర్కొన్న అధికారి ఎంతటి తీవ్రమైన అక్రమాలకు పాల్పడ్డారో కేసులో స్పష్టంగా ఉండాలి'

\- రెవెన్యూశాఖ సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

ప్రభుత్వ నిర్ణయంతో అక్రమార్కుల్లో గుబులు

- నగరం, పరిసరాల్లో భారీగా ఆక్రమణలు
- క్రమబద్ధీకరణతో అనేకమందికి ఊరట
- కోర్టులో పేరుకుపోయిన కేసులు
- నిర్వీర్యమైన భూ పరిరక్షణ విభాగం



పెందుర్తి మండలం సుజాతానగర్‌లో ఆక్రమణకు గురైన రాజుల చెరువు

విశాఖ జిల్లాలో ప్రభుత్వ భూములు పెద్దఎత్తున ఆక్రమణలను గురయ్యాయి. ఇప్పటికీ ఏదో ఒక చోట చిన్న స్థలం నుంచి గెడ్డ, వాగు, కొండ పోరంబోకు ఆక్రమణలకు గురవుతున్నట్టు పత్రికల్లో కథనాలు వస్తుంటాయి...లేదా స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేస్తున్నారు. భూముల విలువ పెరగడంతోపాటు కొందరు అదేపనిగా ప్రభుత్వ భూములు ఆక్రమించుకోవడం, కొందరు అధికారులు, దిగువ స్థాయి సిబ్బంది సహకరించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో ఈ ఆక్రమణల వ్యవహారం పెచ్చుమీరింది. వైసీపీ నేతల జోక్యంతో అక్రమార్కులు రెచ్చిపోయారు.

సుమారు మూడేళ్ల క్రితం పెందుర్తి మండలంలో ప్రభుత్వ భూమి ఆక్రమణలు తొలగించడంతో రెవెన్యూ ఉద్యోగులపై ఓ వైసీపీ నేత దాడి చేశాడు. పెందుర్తి, గాజువాక, ఆనందపురం, విశాఖ రూరల్ మండలాల్లో ఆక్రమణల తంతు ఎక్కువ. ఫిర్యాదులు, పత్రికల్లో కథనాలపై రెవెన్యూ అధికారులు స్పందించి, ఆక్రమణలు తొలగించి హెచ్చరిక బోర్డులు పెడుతున్నారు. కొద్దిరోజుల తరువాత మళ్లీ ఆక్రమణదారులు తెగబడుతున్నారు. స్థానికులతో పాకలు వేయించి, ఆ తరువాత రేకుల షెడ్లు నిర్మించి విక్రయించడం ఈ మండలాల్లో పరిపాటిగా మారింది.

పెందుర్తి మండలంలో చెరువులు, వాగులు ఎక్కువగా ఆక్రమణలకు గురయ్యాయి. పెందుర్తి సర్వేనంబరు 117, చీమలాపల్లి సర్వే నంబరు 55, సుజాతనగర్ సర్వే నంబరు 171లో ఆక్రమణపై అధికారులు కేసులు నమోదుచేశారు. పెందుర్తి దగ్గవారి చెరువు ఆక్రమణలపై అధికారులు ఆలస్యంగా మేలుకున్నారు. చినముషిడివాడలో ఒక చెరువు ఆక్రమణకు గురవగా, చీమలాపల్లి నుంచి పెందుర్తికి వెళ్లే దారిలో ఓ కార్పొరేటర్ ప్రభుత్వ భూమిని గుప్పిట్లో పెట్టుకున్నారు. వీటన్నింటి వెనుక రెవెన్యూ అధికారులు ఉన్నారనేది కాదనలేని వాస్తవం.

ఆనందపురం మండలం శొంఠ్యాం రెవెన్యూ పరిధి మిందివానిపాలెంలో గంభీరం జలాశయానికి వెళ్లే గెడ్డ వాగు పలుచోట్ల ఆక్రమణలకు గురైంది. ప్రవాహానికి అడ్డుగా ఓ రియల్ ఎస్టేట్ సంస్థ గోడ నిర్మించేసింది. కణమాంలో వైసీపీ నేత రైతుభరోసా కేంద్రానికి సమీపంలో ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుని ఇల్లు నిర్మించుకున్నాడు. గిడిజాలలో జగనన్న కాలనీకి ఆనుకుని కొండను కొందరు ఆక్రమించుకుని పక్కా ఇళ్లు నిర్మించుకున్నారు.

మధురవాడ రెవెన్యూ పరిధి బక్కన్నపాలెంలో మాజీ సైనికోద్యోగి పేరుతో స్థలం ఆక్రమించుకుని బహుళ అంతస్తు నిర్మించారు. ఈ స్థలానికి పట్టాదారు పాసుపుస్తకం, అడంగళ్ లేవు. ఎండాడలో మాజీ ప్రజా ప్రతినిధి బహుళ అంతస్తుల భవనం కోసం ప్రభుత్వ భూమిలో ర్యాంపు నిర్మించారు.

ఆక్రమణదారులకు దన్నుగా జీవోలు

నగరంలో సుమారు 60 నుంచి 70వేలమంది కొండవాలు ప్రాంతాలు ఆక్రమించుకుని ఇళ్లు నిర్మించుకున్నారు. పేదలతోపాటు ప్రభుత్వ ఉద్యోగులు, పలుకుబడి కలిగిన వారంతా భవంతులు నిర్మించేశారు. వీరిలో కొందరిపై గతంలో కేసులు పెడితే కోర్టును ఆశ్రయించారు. పదేళ్ల క్రితం టీడీపీ హయాంలో నగరంలో ఆక్రమణల క్రమబద్ధీకరణకు 296, 388 జీవోలు వచ్చాయి. దీంతో పేదలతోపాటు ప్రభుత్వ ఉద్యోగులు, డబ్బున్న వారికే మేలు చేకూరింది. భూఆక్రమణదారులపై రెవెన్యూ అధికారులు కేసులు పెడితే వారంతా కోర్టుకు వెళ్లి స్టేలు తెచ్చుకున్నారు. కొన్ని మాత్రమే ప్రభుత్వానికి అనుకూలంగా వచ్చాయి. మరికొన్ని రిజిస్ట్రేషన్ విలువ చెల్లించి సొంతం చేసుకున్నారు. ఇంకా అనేక కేసులు కోర్టులో పెండింగ్‌లో ఉన్నాయి.

భూపరిరక్షణ విభాగం నిర్వీర్యం

జిల్లాలో ప్రభుత్వ

... మిగతా 6వ పేజీలో

అరకొర నిధులే!

మెగా పేరెంట్, టీచర్ సమావేశంపై ఉపాధ్యాయుల మల్లగుల్లాలు

- 100 మంది విద్యార్థులుంటే రూ.2,400, 200 వరకు రూ.3 వేలు, 500 దాటితే రూ. 7వేలు, 1000 దాటితే రూ.12వేలు
- షామియానాలు, కుర్చీలు, మైక్ ఏర్పాటు చేయాల్సిందే
- దాతల సాయంతో విద్యార్థులకు స్వీట్లు, పండ్లు అందించాలి
- విద్యాశాఖ హడావిడితో ఉపాధ్యాయుల్లో కంగారు

విశాఖపట్నం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి):

మెగా పేరెంట్, టీచర్ సమావేశాన్ని ఈనెల ఏడో తేదీన ప్రతి ప్రభుత్వ పాఠశాలలో పెద్దఎత్తున నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. పాఠశాల విద్యా వ్యవస్థలో అతి పెద్ద పండుగగా చేపట్టాలని ప్రభుత్వం సూచించింది. ఇందుకోసం నిధులు విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అయితే అరకొరగా ఇచ్చిన నిధులతో పెద్దఎత్తున సమావేశం ఎలా నిర్వహించాలో తెలియక ఉపాధ్యాయులు తలలుపట్టుకుంటున్నారు.



విద్యార్థులకు అందించనున్న ప్రోగ్రెస్ కార్డుల నమూనా

జిల్లాలోని 595 ప్రభుత్వ పాఠశాలల్లో సమావేశాల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రతి చోటా స్థానిక ప్రజాప్రతినిధులు, ఇతర ప్రముఖులను ఆహ్వానించాలని హెచ్‌ఎంలను ఆదేశించారు. కాగా జిల్లాలోని ఎంపిక చేసిన 25 పాఠశాలల్లో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లా అధికారులు పాల్గొంటారు.

టీచర్ల జేబు గుల్లే...

ఇంతవరకు బాగానే ఉన్నా మెగా పేరెంట్, టీచర్ మీటింగ్ నిర్వహణకు ప్రభుత్వం అరకొర నిధులు కేటాయించడంతో ప్రధానోపాధ్యాయులు తలలు పట్టుకుంటున్నారు. పదిమందిలోపు పిల్లలున్న పాఠశాలలకు కేవలం రూ.1000, 11 నుంచి 25 మంది కంటే తక్కువగా ఉంటే రూ.1200, 26నుంచి 50మంది వరకు రూ.1600, 51 నుంచి 75 వరకు రూ.రెండువేలు, 101 నుంచి 200 మంది ఉన్న పాఠశాలలకు రూ.మూడువేలు మంజూరుచేశారు. 500 మంది పిల్లలున్న పాఠశాలలకు రూ.ఏడువేలు, వెయ్యి మంది దాటితే రూ.12వేలు, రెండువేల మంది దాటితే రూ.14వేలు మంజూరుచేశారు. ఈ నిధులతో పాఠశాల ఆవరణలో టెంట్లు వేయాలి. కుర్చీలు, మైకు ఏర్పాటుచేయాలి. వచ్చిన వారందరికీ మధ్యాహ్నం విందు భోజనం పెట్టాలి. విద్యార్థులకు స్వీట్లు, పళ్లు అందించేందుకు గ్రామంలో దాతల నుంచి విరాళాలు సేకరించాలి. బొకేలు, పూలదండలు, టీ, బిస్కెట్లు సమకూర్చుకోవాలి. ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగే సమావేశం మొత్తాన్ని వీడియో తీసి సంబంధిత యాప్‌లలో అప్‌లోడ్ చేయాలి. ప్రభుత్వం అందించిన ప్రోగ్రెస్ కార్డులను వేదికపైనే విద్యార్థులకు పంపిణీ చేయాలి. ఉద్దేశం మంచిదే అయినా అరకొర నిధులతో పండుగ వాతావరణంలో సమావేశం ఎలా నిర్వహించాలో అర్థం కావడం లేదని పలువురు ప్రధానోపాధ్యాయులు వాపోతున్నారు. కార్యక్రమం బాగా చేయాలంటే చేతా చమురు వదుల్చుకోవాలంటున్నారు. మంచి కార్యక్రమం రూపొందించే సమయంలోనే సరిపడా నిధులు కేటాయిస్తే సమస్యలు ఉండవని అభిప్రాయపడుతున్నారు.

హెచ్‌ఐవీని తరిమికొడదాం



నా ఆరోగ్యం నా హక్కు, నినాదంతో ఎవరూ హెచ్‌ఐవీ బారిన పడకుండా కాపాడుకోవాలని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ పిలుపునిచ్చారు. ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినం సందర్భంగా ఆదివారం అవగాహన ర్యాలీని ఆయన ప్రారంభించారు.

సందడిగా వైజాగ్ మారథాన్



సాగరతీరంలో ఆదివారం రన్నర్స్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన వైజాగ్ మారథాన్‌కు విశేష స్పందన లభించింది. 1కె, 10కె, 5కె, 3కె విభాగాల్లో నిర్వహించిన మారథాన్‌లో ఔత్సాహికులు వేలాదిగా పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే గంటా జన్మదినోత్సవం



భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పుట్టినరోజు వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఎంవీపీ కాలనీలోని ఆయన స్వగృహంలో అభిమానుల మధ్య కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఉమ్మడి విశాఖ జిల్లాలోని అనేక నియోజకవర్గాల నుంచి గంటా అభిమానులు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు గంటా నివాసానికి చేరుకుని ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

విద్యార్థులకు బిగ్ రిలీఫ్

తప్పిన ఫీజు పరేషాన్



- ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు పాత విధానం అమలు
- నేరుగా కళాశాలలకు చెల్లిస్తామని సాంఘిక సంక్షేమ శాఖ ఉత్తర్వులు
- 2024-25 విద్యా సంవత్సరానికి కాలేజీల ఖాతాలకే జమ



- జిల్లాలోని వేలాది మంది విద్యార్థులకు ఊరట
- బకాయిలపైనా దృష్టిపెట్టిన కూటమి సర్కారు

విశాఖపట్నం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి):

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలుచేస్తూ కూటమి ప్రభుత్వం ప్రజల ఆదరణకు నోచుకుంటోంది. తాజాగా విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ మొత్తాన్ని నేరుగా కళాశాలలకే జమ చేస్తామని ప్రకటించింది. ఈ నిర్ణయం విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు ఊరట కలిగించింది.


గత వైసీపీ ప్రభుత్వ హయాంలో విద్యార్థులను తీవ్ర ఇబ్బందులకు గురిచేసిన ఫీజు రీయింబర్స్‌మెంట్ విధానాన్ని మారుస్తామని ఎన్నికల సమయంలో కూటమి నేతలు హామీ ఇచ్చారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వం నేరుగా కాలేజీలకు చెల్లించేది. వైసీపీ అధికారంలోకి వచ్చాక ఎన్నికల్లో లబ్ధి పొందాలనే దురుద్దేశంతో విద్యార్థులు తల్లుల ఖాతాలకు జమ చేసేంది. ఒక్కో ఏడాది ఫీజును నాలుగు విడతల్లో ఇస్తామని హామీ ఇచ్చి, ఒక్క ఏడాది కూడా పూర్తిస్థాయిలో విడుదల చేయలేదు. దీనివల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రెండు, మూడు విడతలు పెండింగ్‌లో పెట్టడంతో ఈ విధానం విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు శాపంగా పరిణమించింది. ఈ విషయాన్ని పాద యాత్ర సమయంలో

... మిగతా 6వ పేజీలో

లైట్లు వెలిగితేనే... బిల్లు!

కార్పొరేటర్ల నుంచి ఎన్‌వోసీ తేవాలని కమిషనర్ మెలిక

- వారిని ప్రసన్నం చేసుకునే పనిలో కాంట్రాక్టరు
- నగరంలో సగానికి పైగా వెలగని వీధి దీపాలు
- నిర్వహణను గాలికొదిలేసిన గుత్తేదారు
- అరకొర సిబ్బందితోనే నెట్టుకొస్తున్నవైనం
- కమిషనర్ చర్యలపై నగరవాసుల్లో హర్షాతిరేకాలు



(విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి)

మా వార్డులో వీధి దీపాలన్నీ సక్రమంగా వెలుగుతున్నా యి. ఎక్కడైనా మరమ్మతులకు గురైనా ఒకరోజు వ్యవధిలోనే సిబ్బంది సమస్య పరిష్కరిస్తున్నారు. కాంట్రాక్టర్ సేవలపట్ల సంతృప్తిగానే ఉన్నామని పేర్కొంటూ ఒక లేఖ ఇవ్వండి ప్లీజ్' అంటూ వీధిదీపాల నిర్వహణ కాంట్రాక్టర్ నగరంలోని కార్పొరేటర్లకు విజ్ఞప్తి చేస్తున్నారు. వీధిదీపాల నిర్వహణ బిల్లు చెల్లించాలంటే కార్పొరేటర్ల నుంచి బిల్లు చెల్లింపునకు అభ్యంతరం లేదంటూ ఎన్‌ఓసీ తేవాల్సిందేనని జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్ షరతు విధించడంతో వారి చుట్టూ కాంట్రాక్టర్ ప్రదక్షిణ చేస్తున్నారు.

జీవీఎంసీ పరిధిలో సుమారు 1.2 లక్షల వీధిదీపాలున్నాయి. వీటి నిర్వహణ బాధ్యతను జీవీఎంసీ ప్రైవేటు ఏజెన్సీకి అప్పగించింది. ఇందుకోసం ఏటా రూ.ఏడు కోట్లు చెల్లించేందుకు కాంట్రాక్టర్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. వీధిదీపాలను ప్రతి రోజూ సక్రమంగా వెలిగించడంతోపాటు ఎక్కడైనా వెలగకపోతే ఒక రోజు వ్యవధిలోనే సమస్యను పరిష్కరించాలని షరతు విధించింది. లేదంటే ఒక్కో వీధి దీపానికి

... మిగతా 6వ పేజీలో

జీవీఎంసీ పరిధిలో మొత్తం వీధి దీపాలు	1.2 లక్షలు
నిర్వహణకు ఏటా కాంట్రాక్టర్‌కు చెల్లిస్తున్న మొత్తం:	రూ.7కోట్లు
ప్రస్తుతం వెలుగుతున్న లైట్లు (అంచనా)	70వేలు

కొనసాగిన ముసురు



విశాఖపట్నం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ముసురు వాతావరణం కొనసాగింది. పుదుచ్చేరి వద్ద తుపాన్ తీరం దాటినా దాని ప్రభావంతో ఉత్తరాంధ్ర జిల్లాలపైకి మేఘాలు ఆవరించాయి. ఉదయం వరకు తీరం వెంబడి గాలులు వీచాయి. సముద్రం అల్లకల్లోంగా ఉండడంతో అలలు ఎగసిపడ్డాయి. పలుమార్లు మోస్తరు వర్షం కురిసింది. గ్రామీణ ప్రాంతంలో వరి చేలు తడిసిపోయాయి. పిక్నిక్‌లకు అంతరాయం ఏర్పడింది.

నేడు ప్రజాసమస్యల పరిష్కార వేదిక

పద్మనాభం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : పద్మనాభంలోని మండల పరిషత్తు కార్యాలయం సమావేశ మందిరంలో ఈనెల 2న (సోమవారం) ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్టు ఎంపీడీవో తెలిపారు. ఇందులో అన్ని శాఖలకు సంబంధించిన సమస్యలపై ప్రజలు వినతులు సమర్పించుకోవచ్చని చెప్పారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విశాఖ డెయిరీ వద్ద ధర్నాకు పాడి రైతులు హాజరు కావాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి పైడిరాజు

పద్మనాభం రూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఆవుపాల సేకరణ ధర లీటరుకు మూడు రూపాయిలు తగ్గించడాన్ని వ్యతిరేకిస్తూ సోమవారం ఉదయం విశాఖ డెయిరీ వద్ద నిర్వహించనున్న ధర్నాలో పాడిరైతులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు పిలుపునిచ్చారు. ఆదివారం ఉదయం మండలంలో అనంతవరం, పెంట, కొవ్వాడ, మద్ది, పద్మనాభం, కృష్ణాపురం, బోని తదితర గ్రామాల్లో పాల సేకరణ కేంద్రాల్లో పాడి రైతులతో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యావసర వస్తువులు, పశులకు దాణా, పాలప్యాకెట్ల ధరలు పెరుగుతుంటే రైతులకు ఇస్తున్న పాలసేకరణ ధర మాత్రం తగ్గించడం అన్యాయమన్నారు. విశాఖ డెయిరీకి ఏడు జిల్లాల నుంచి సుమారు మూడున్నర లక్షల మంది పాడిరైతులు పాలు సరఫరా చేస్తున్నారని, సదరు సంస్థ ఏకపక్ష నిర్ణయం వల్ల పాడి రైతులకు ఆర్థికంగా నష్టం కలుగుతుందన్నారు. డెయిరీలో, గ్రామాల్లో ఉన్న అనుబంధ సంస్థల్లో గడచిన కొంతకాలంగా జరుగుతున్న అవినీతి, అక్రమాలపై పూర్తి స్థాయి విచారణ జరపాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సోమవారం నిర్వహిస్తున్న ధర్నాకు పాడి రైతులు అధిక సంఖ్యలో తరలిరావాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల పాల సొసైటీల డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

ముగిసిన కార్తీక మాసం పూజలు

పద్మనాభం రూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : పవిత్ర కార్తీక మాసం ఆదివారంతో ముగిసింది. ఆదివారం ఉదయం వరకు అమావాస్య ఉండడంతో కార్తీక మాసం పూర్తి అవుతుంది. సోమవారం తెల్లవారుజామున స్థానిక గోస్తానీనది పరివాహక ప్రాంతాల్లో గల మద్ది, పోట్నూరు, వీకే పాలెం, ఇసకలపాలెం, కృష్ణాపురం, బోని, రేవిడి, పాండ్రంగి, సామయ్యవలస, మునవానిపాలెం, భక్తులు అయా ప్రాంతాల్లో గోస్తనీ నదిలో అరటి దొప్పలో దీపాలు వెలిగించి నీటిలో ఆ దీపాలు వదలారు. కార్తీక మాసం నేపథ్యంలో నెలంతా పూజలతో సందడి వాతావరణం కనిపించింది.

పదమూడున్నర తులాల బంగారం చోరీ

భీమునిపట్నం (రూరల్) డిసెంబర్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సింగనబంద గ్రామం వద్ద కేవీఆర్ ఎస్టేట్స్‌లో నివసిస్తున్న గండి సుగుణ అనే మహిళకు చెందిన పదమూడున్నర తులాల బంగారం చోరీ జరిగినట్టు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు అందింది. ఈ మేరకు మధురవాడ క్రైమ్ ఏసీపీ ఎ.వెంకటరావు, సీఐ డీఎస్ఎస్ ప్రకాశ్, ఎస్ఐ ఎస్.సూర్యప్రకాశ్‌లు ఆదివారం సాయంత్రం ఆ ఇంటిని పరిశీలించారు. గ్రామంలో గండి వేణుగోపాల్ భార్య సుగుణ తమ కుమార్తెతో కలిసి ఉంటున్నారు. నవంబరు 22న తన వద్ద పదమూడున్నర తులాల బంగారు ఆభరణాలతో పాటు కొంత నగదును గ్రౌండ్ ఫ్లోర్‌లో గల కప్‌బోర్డులో పెట్టి 23న తీర్థయాత్రలకు వెళ్లి 29న తిరిగి వచ్చారు. 30వ తేదీన కప్‌బోర్డులో చూడగా ఆభరణాలు కనిపించలేదని సుగుణ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. తాను తీర్థయాత్రలకు వెళ్లగా భర్త వేణుగోపాల్, కుమార్తె ఇంట్లోనే ఉన్నారన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అప్పన్న స్వామికి స్వర్ణ పుష్పార్చన

సింహాచలం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రహ్లాదవరదుడైన సింహాచల వరాహలక్ష్మీనృసింహస్వామికి వైభవంగా స్వర్ణ పుష్పార్చన నిర్వహించారు. ఇందులో భాగంగా ఆదివారం వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలను యథావిధిగా పూర్తి చేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయదేవేరులతో ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనాలు చేసి షోడశోపచారాలు సమర్పించారు. నారసింహ అష్టోత్తర శతనామాలు పఠిస్తూ పసిడి సంపెంగలతో పూజలు చేశారు. భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలను అందజేశారు. అనంతరం ఇదే వేదికపై స్వామివారి నిత్య కల్యాణాన్ని జరిపారు.

సంప్రదాయ మత్స్యకారుల 'సంక్షేమం' పట్టించుకోరూ!

- చెరువుల్లో చేపలు పట్టేవారి అభ్యర్థన
- మత్స్యకారులకు అందించే ఏ పథకం వర్తించడం లేదంటూ ఆవేదన



తాటితూరు చెరువులో చేపడుతున్న సంప్రదాయ మత్స్యకారులు

భీమునిపట్నం (రూరల్), డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : సముద్రంలో చేపలు పట్టి జీవించే వారినే మత్స్యకారులుగా పరిగణిస్తూ వారికే ప్రభుత్వ పథకాలు కేటాయిస్తున్నారని, కానీ దుర్భరంగా జీవిస్తున్న తమను కూడా మత్స్యకారులుగా గుర్తించాలని చెరువుల్లో చేపలు చేపట్టే వారు కోరుతున్నారు. భీమిలి నియోజకవర్గంలో సముద్రతీర మత్స్యకారులు 12 వేల కుటుంబాలకు చెందినవారు ఉండగా, వీరిలో కొంతమంది మాత్రం చేపలవేటను వృత్తిగా స్వీకరించి చేపలను పడుతున్నారు. మిగిలిన వారు ఇతర పనులు చేస్తూ జీవిస్తుంటారు.

కాగా, మండలంలోని తాటితూరు, బోని, చిప్పాడ, సంగివలస, చిట్టివలస, మజ్జివలస తదితర గ్రామాల్లో చేపలవేటను వృత్తిగా చేసుకున్న వారు 410 కుటుంబాలు ఉన్నాయి. వీరిని సంప్రదాయ మత్స్యకారులుగా పిలుస్తుంటారు. వీరి సామాజికవర్గాన్ని నెయ్యిల అని పిలుస్తుంటారు. వీరంతా సముద్రంలో కాకుండా చెరువుల్లో చేపలను పట్టి జీవనాన్ని గడుపుతుంటారు. అయితే వీరికి సముద్రతీర మత్స్యకారులకు అందే ఏ పథకాలూ అందడం లేదు. పడవలు, వలల కొనుగోలుకు రుణాలు, రాయితీలు, వేట విరామ సమయంలో అందించే పరిహారాలు వంటివి ఏవీ రావడం లేదు. మత్స్యకారులుగా పిలవబడుతున్న తమకు ఎటువంటి సదుపాయాలు కల్పించడం లేదని, తమ జీవనం విధానమంతా మత్స్యకారుల మాదిరే ఉంటుందని సంప్రదాయ మత్స్యకార కుటుంబానికి చెందిన సింగిడి అప్పలరాజు తెలిపారు. చెరువుల్లో చేపలు పట్టడానికి సహకార సంఘాలుగా ఏర్పాటు చేస్తున్నారని, వాటిలో తమ కులస్తులకు మాత్రం అవకాశం కల్పిస్తున్నారని తెలిపారు. అయితే, మార్కెటింగ్ సదుపాయాలు, చేపల విత్తనాల పంపిణీ వంటి ఏ పనులు కూడా చేయడం లేదని అంటున్నారు. ఎంతోమంది చెరువుల్లో చేపపిల్లల్ని వేసి వాటిని సంరక్షించడం వాటిని అమ్మకాలు చేయడం వంటి పనులు చేస్తూ జీవనాన్ని గడుపుతున్నారు. వీరిని సంప్రదాయ మత్స్యకారులుగా గుర్తించినప్పటికీ ప్రభుత్వపరంగా లభించే సహాయాలను అందించడం లేదని, తక్షణం తమను ఆదుకోవాలని కోరుతున్నారు.



సంగివలస చెరువులో చేపల వేట

హెచ్ఐవీపై అవగాహనతోనే నిర్మూలన సాధ్యం

- డాక్టర్ ఫణికుమార్



గంటస్తంభం వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న వైద్య సిబ్బంది, విద్యార్థులు

భీమునిపట్నం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ హెచ్ఐవీపై అవగాహన పెంపొందించుకోవాల్సిఉందని, అప్పుడేఈ మహమ్మారిని నియంత్రించడం సాధ్యమవుతుదని పట్టణ ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మేఘం ఫణికుమార్ అన్నారు. ఆదివారం ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా సీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై యువత చైతన్యవంతులు కావాలని, ఎయిడ్స్ నిరోధానికి అందరూ సహకరించాలని కోరారు. ఆస్పత్రిలో యువతకు అవగాహన కల్పించారు. సీహెచ్‌సీలోని ఐసీటీసీ కేంద్రంలో ఎయిడ్స్ పరీక్షలు ఉచితంగా చేస్తారని, వివరాలు గోప్యంగా ఉంచుతారని తెలిపారు. ప్రతి గర్భిణి, ఆమె భర్త తప్పనిసరిగా హెచ్ఐవీ పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఒకవేళ గర్భిణికి హెచ్ఐవీ సోకితే బిడ్డకు రాకుండా నేవిరాపిన్ చుక్కలమందు అందుబాటులో ఉందన్నారు. సురక్షితం కాని లైంగిక సంబంధాల వల్లే ఈ వ్యాధి ఎక్కువగా వ్యాప్తి చెందుతుందన్నారు. అనంతరం, ఎయిడ్స్ అవగాహనా ర్యాలీ నిర్వహించారు. గంటస్తంభం వద్ద మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీటీసీ కౌన్సిలరు వెంకటరాజు, ఆస్పత్రి సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పద్మనాభంలో..

పద్మనాభం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాల్లో ఎస్‌వోఎస్ కుటుంబ బలోపేతం కార్యక్రమంలో భాగంగా ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివారం ర్యాలీలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. మహిళా సంఘాల సభ్యులు కుటుంబ బలోపేతం కార్యక్రమంలో లబ్ధిదారులుగా ఉన్న విద్యార్థులు రేవిడి, వెంకటాపురం, కోరాడ, కుర్రపల్లి తదితర గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించి ఎయిడ్స్ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్‌వోఎస్ ప్రతినిధులు కె.దుర్గరాజు, యానిమేటర్లు జానకి, మణి, ఆదిలక్ష్మి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



కోరాడలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఉత్సాహంగా రచయితలు, కవుల సమ్మేళనం



పుస్తకాలు ఆవిష్కరిస్తున్న రచయితలు, కవులు

భీమునిపట్నం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : భీమిలిలో ఆదివారం కళాసాహితి సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో ఉత్తరాంధ్ర కథా రచయితల సమ్మేళనం ఉత్సాహంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆ సంస్థ అధ్యక్షుడు పొత్తూరు రాజేంద్రప్రసాద్ వర్మ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సీనియర్ రచయితలు కె.రామ్మోహనరావు (ఎదురులేని ఏడు), పోలిపల్లి శ్రీనివాసరావు (పోలిపల్లి శతకం), కె.లక్ష్మీగాయత్రి (పెళ్లి పుస్తకం), ఎం.సుగుణారావు (ఫైనల్ డయాగ్నోసిస్) రచనలను ఆవిష్కరించారు. అనంతరం వర్మ ఔత్సాహికులకు రచనా వ్యాసంగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పి.ఎస్.ఎస్.లక్ష్మి నేనెందుకు రాస్తున్నాను, ఎం.సుగుణారావు కథారచనలో మెలకువలు, కొయిలాడ రామ్మోహనరావు రచనా శైలి, భాషలపై మాట్లాడారు. జానపద సాహిత్యంపై దామరాజు విశాలాక్షి, జానపద గేయంపై రేపల్లె ఈశ్వరరావులు విపులంగా వివరించారు. కథారచయితలకు దుశ్శాలువలు కప్పి ఘనంగా సత్కరించారు. అనంతరం, పట్టణంలో పర్యాటక ప్రాంతాలుగా పేరొందిన సాగరతీరం, ఎర్రమట్టిదిబ్బలు, ప్రసిద్ధ లక్ష్మీనృసింహస్వామి ఆలయం తదితర ప్రాంతాలను సందర్శించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి అడిదం సన్యాసిరాజు, గౌరవాధ్యక్షుడు రేలంగి పెదబాబు, కోశాధికారి కాళ్ల సన్నీ, ఉపాధ్యక్షులు ఎం.కోటయ్య, కార్యదర్శులు అడిదం కిషోర్, ముసునూరి సూర్యశ్రీనివాసరావు, పోలిపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



టీడీపీ భీమిలి కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న గంటా తనయుడు రవితేజ



రుషికొండ వేంకటేశ్వరస్వామిని దర్శించి వస్తున్న గంటా శ్రీనివాసరావు, తదితరులు

పలుచోట్ల గంటా శ్రీనివాసరావు పుట్టినరోజు వేడుకలు

భీమునిపట్నం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): బీచ్ రోడ్డులో ఉన్న టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు జన్మదిన వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే తనయుడు టీడీపీ యువనేత గంటా రవితేజ కేక్ కట్ చేసి నాయకులు, కార్యకర్తలకు పంచి పెట్టారు.

అనంతరం ఎన్టీఆర్ బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని రుషికొండ జీమ్‌సర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య, దంత వైద్య శిబిరాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులు అందించాలని నిర్వాహకులను కోరారు. రక్తదాతలకు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు. దివ్యాంగులకు గంటా శారద హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ ద్వారా వీల్ చైర్లను పంపిణీ చేయడంతో పాటు అనాథ బాలలకు దుస్తులను రవితేజ అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ గాడు చిన్నికుమారి లక్ష్మి, టీడీపీ నాయకులు యార్లగడ్డ జీవన్ కుమార్, గంటా నూకరాజు, గొలగాని నరేంద్రకుమార్, పి.నరసింగరావు, జి.ఎల్లయ్య(కింగ్), ఎం.అమర్‌నాథ్, డి.కొండబాబు, కె.కృష్ణారావు, కె.అప్పారావు, పి.త్రినాథకుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో 'గంటా' పూజలు

సాగర్‌నగర్: తన జన్మదినాన్ని పురస్కరించుకుని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఇక్కడి మోగదారమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రుషికొండ వేంకటేశ్వరస్వామిని దర్శించుకుని వేదపండితుల ఆశీర్వచనాలను తీసుకున్నారు. భక్తుల సౌకర్యాల కల్పనలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆయన ఆలయ అధికారులకు సూచించారు. గంటా వెంట కార్పొరేటర్ లొడగల అప్పారావు, టీడీపీ నాయకులు చెట్టుపల్లి గోపి, చిన్నగోపి, జనసేన నాయకుడు శేఖరి శ్రీనివాసరావు, తదితరులు ఉన్నారు.

ఐదో వార్డులో పేదలకు దుస్తులు పంపిణీ

కొమ్మాది: ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు జన్మదినం సందర్భంగా ఐదో వార్డు పరిధి మారికవలసలో మాజీ కార్పొరేటర్ మన్నాల సోంబాబు కేక్ కట్ చేయడంతో పాటు కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేశారు. పేదలకు దుప్పట్లు, చీరలు, టవల్స్ పంపిణీ చేశారు. నాయకులు మన్నాల సురేశ్, రామారావు, ఈశ్వరరావు, చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.



ఏర్పాట్లపై క్షేత్ర పరిశీలన చేస్తున్న ఈవో త్రినాథరావు

నృసింహ దీక్షల ఏర్పాట్లపై ఈవో సమీక్ష

సింహాచలం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): వేలాది మంది భక్తులు స్వీకరించే నృసింహ దీక్షల ఏర్పాట్లపై వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం కార్యనిర్వాహణాధికారి వేంద్ర త్రినాథరావు ఆదివారం అధికారులతో కలిసి సమగ్రంగా సమీక్షించారు. ఇందులో భాగంగా రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా చందన స్వాములకు, నిత్య భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తగిన ఏర్పాట్లు చేసేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని ఆదేశించారు. దీంతోపాటు చందనస్వాములకు గతంలో మాదిరిగా అన్ని సదుపాయాలు నిర్విఘ్నంగా జరగాలన్నారు. ప్రతిరోజు అప్పన్నస్వామి దర్శనానికి విచ్చేసే భక్తులకు వర్షం వల్ల ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సూచించారు. కాగా ప్రసాదాల విక్రయశాల వద్ద క్యూలు, ఆలయంలో వర్షపు నీరు కారే ప్రాంతాలను ఆయన పరిశీలించి తగిన సూచనలిచ్చారు.



స్వామివారికి పూజలు చేస్తున్న అర్చకుడు

నేత్రపర్వంగా లక్ష దీపోత్సవం

ఆనందపురం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంభీరంలో గల హరేకృష్ణ వైకుంఠంలోని వైకుంఠ శ్రీనివాస గోవిందునికి, దామోదర శ్రీకృష్ణుడుకి లక్ష దీపోత్సవ కార్యక్రమాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైకుంఠ వేంకటేశ్వరస్వామి దామోదర కృష్ణుడు మూల విరాట్ విగ్రహాలకు వివిధ రకాల పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. అనంతరం దామోదర అష్టకాన్ని భక్తులు పఠిస్తూ నేతితో దీపారాధన చేశారు. వివిధ సంగీత వాయిద్యాల నడుమ భక్తులు ఆధ్యాత్మికతో లయబద్ధంగా నాట్యం చేశారు.

అంతర్ కళాశాలల పురుషుల ఫుట్‌బాల్ టోర్నీ ప్రారంభం

విశాఖపట్నం స్పోర్ట్సు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఏయూ అంతర్ కళాశాలల పురుషుల ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ టోర్నీ, ఆంధ్ర విశ్వవిద్యాలయం జట్టు ఎంపికలు ప్రారంభమయ్యాయి. గోల్డెన్ జూబ్లీ గ్రౌండ్‌లో జరుగుతున్న ఈ పోటీలను ఏయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇ.ఎన్.ధనుంజయరావు ప్రారంభించారు. ఏయూ సమకూర్చిన సదుపాయాలు, వివిధ ప్రోత్సాహాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత క్రీడాకారులుగా రూపొందాలని ఆయన ఆకాంక్షించారు. వ్యాయామ విద్య క్రీడా శాస్త్రం సంచాలకులు ఆచార్య ఎన్.విజయ్‌మోహన్ మాట్లాడుతూ రెండు రోజులు జరిగే ఈ టోర్నీలో ఏయూ పరిధిలోని ఆరు జట్లు పాల్గొంటున్నాయని తెలిపారు.

సోమవారం ప్రత్యేకంగా మ్యాచ్‌లు నిర్వహించి సౌత్‌జోన్ అంతర్ వర్సిటీల ఫుట్‌బాల్ టోర్నీలో పాల్గొనేందుకు ప్రతిభ గల క్రీడాకారులను ఆంధ్ర విశ్వవిద్యాలయం జట్టుకు ఎంపిక చేస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో ఏయూ ఫుట్‌బాల్ జట్టు సెలక్షన్ కమిటీ సభ్యుడు డాక్టర్ బీఆర్ఎస్ లక్ష్మణరెడ్డి, ఐఏపీఈ క్రీడాధికారి డాక్టర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బిగ్ రిలీఫ్

... 5వ పేజీ తరువాయి

విద్యార్థులు లోకేశ్ దృష్టికి తీసుకెళ్లడంతో అధికారంలోకి వస్తే పాత విధానం అమలు చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. అందుకు అనుగుణంగా సాంఘిక సంక్షేమశాఖ ఉత్తర్వులు విడుదల చేసింది. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించిన ఫీజులను నేరుగా కాలేజీ యాజమాన్యాలకు చెల్లిస్తామని పేర్కొంది. దీంతో జిల్లాలో డిగ్రీ, ఇంజనీరింగ్, ఫార్మసీ, ఐటీఐ, పాలిటెక్నిక్ వంటి అనేక కోర్సులు చదువుతున్న విద్యార్థులకు ఊరట కలిగింది.

ఇప్పటికే తీవ్ర స్థాయి ఒత్తిడి

ఈ విద్యా సంవత్సరం ప్రారంభమై నాలుగు నెలలు దాటుతున్నా ప్రభుత్వం నుంచి ఫీజు చెల్లింపులపై స్పష్టమైన మార్గదర్శకాలు రాకపోవడంతో అనేక కళాశాలల యాజమాన్యాలు తొలి రెండువిడతల ఫీజు చెల్లించాలంటూ విద్యార్థులపై ఒత్తిడి తెస్తున్నాయి. కొన్ని కాలేజీల యాజమాన్యాలు మొదటి విడత ఫీజు ముక్కుపిండి మరీ వసూలు చేశాయి. దీంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న విద్యార్థులు సతమతమవుతున్నారు. అయితే పరీక్షలకు హాజరకానివ్వమని, ల్యాబ్స్ రానీయమని కాలేజీలు బెదిరిస్తుండడంతో ఫీజులు చెల్లిస్తున్నారు. ఈ తరుణంలో ప్రభుత్వం నుంచి కీలక ఉత్తర్వులు విడుదల కావడం మేలు చేకూర్చింది. జిల్లాలో వివిధ కోర్సులు చదువుతున్న చదువుతున్న విద్యార్థుల సంఖ్య సుమారు 40 వేలు ఉంటుందని అధికారులు చెబుతున్నారు. వీరందరికీ తాజా నిర్ణయంతో ఉపశమనం కలుగనుంది. ప్రభుత్వమే కాలేజీలకు ఫీజులు చెల్లిస్తామంటూ ఉత్తర్వులు జారీచేసిన నేపథ్యంలో కాలేజీలు ఒత్తిడి చేసే వీలుండదు. ఎక్కడైనా ఇబ్బందులు ఎదురైతే సాంఘిక సంక్షేమశాఖ అధికారులకు ఫిర్యాదు చేయవచ్చని సూచించారు.

పెండింగ్ బకాయిల సంగతేంటి.?

గత వైసీపీ ప్రభుత్వం జిల్లాలోని విద్యార్థులకు సుమారు రూ.100 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ పెండింగ్‌లో పెట్టింది. ఈ చెల్లింపులపై కూటమి ప్రభుత్వం ఆలోచిస్తోందనిచెబుతున్నారు. 2023-24 విద్యా సంవత్సరానికి జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం మార్చిలో ఒక్క విడత సొమ్ము జమ చేసింది. మిగిలిన మూడు విడతలు పెండింగ్‌లో పెట్టింది. 2022-23 ఏడాదికి సంబంధించి ఒక విడత విద్యా దీవెన పెండింగ్‌లో ఉంది. ఈ డబ్బులను విద్యార్థులే కాలేజీలకు చెల్లించారు. ఈ అంశంలో ఎలాంటి నిర్ణయం తీసుకోవాలనే దానిపై ప్రస్తుత కూటమి ప్రభుత్వం అధికారులతో చర్చిస్తోందని చెబుతున్నారు.

భూ కబ్జాదారులపై ఉక్కుపాదం!

... 5వ పేజీ తరువాయి

భూముల పరిరక్షణకు ఒక విభాగం ఉండేది . డిప్యూటీ కలెక్టర్ ఆధ్వర్యంలో తహసీల్దారు, డిప్యూటీ తహసీల్దార్లు, పదిమంది ఆర్ఐలు, సర్వేయర్లు, సిబ్బంది ఉండేవారు. 1989 నుంచి 1994 వరకు జిల్లాలో 150 ల్యాండ్ గ్రాబింగ్ కేసులు పెట్టారు. వీటిలో కొన్ని ప్రభుత్వానికి అనుకూలంగా రాగా మరికొన్నింటి లో ఆక్రమణదారులకు శిక్ష పడింది. ఇంకొన్ని క్రమబద్ధీకరించారు. 1994 తరువాత ల్యాండ్ గ్రాబింగ్ విభాగం నిర్వీర్యమవుతూ వచ్చింది. తరువాత నామమాత్రంగా మిగిలింది. 2000 తరువాతే నగరంలో పెద్దఎత్తున ఆక్రమణలకు దిగారు. నోటీసు ఇస్తే కోర్టుకు వెళ్లడం, అక్కడ కేసు పెండింగ్‌లో ఉండడంతో అధికారుల్లో నిరాశ అలుముకుంది. ల్యాండ్ గ్రాబింగ్ విభాగం చివరకు ల్యాండ్ ప్రొటెక్షన్ విభాగంగా మారిపోయింది. సిబ్బందిని తహసీల్దారు కార్యాలయాలకు పంపేశారు. ప్రస్తుతం డిప్యూటీ కలెక్టర్, అటెండరు మాత్రమే మిగిలారు. ఇదిలావుండగా సీఎం చంద్రబాబునాయుడు తాజాగా భూఆక్రమణదారులపై ఉక్కుపాదం మోపుతామని ప్రకటించిన నేపథ్యంలో జిల్లాలో భూ పరిరక్షణ విభాగాన్ని పటిష్ఠంచేయాలని రిటైర్డు డిప్యూటీ కలెక్టర్ ఒకరు అభిప్రాయపడ్డారు. విశాఖ పరిసరాల్లో వేల కోట్ల భూములు ఆక్రమణలకు గురయ్యాయని, ఇప్పటికైనా చట్టం కఠినంగా అమలుచేస్తేనే ఫలితం ఉంటుందనే వాదన వినిపిస్తోంది. ముఖ్యంగా రెవెన్యూ శాఖలో అవినీతిని అడ్డుకునేలా చట్టంలో మార్పులు అవసరమని అభిప్రాయపడుతున్నారు.

లైట్లు వెలిగితేనే... బిల్లు!

... 5వ పేజీ తరువాయి

రోజుకి రూ.50 చొప్పున జరిమానా చెల్లించాల్సి ఉంటుందని స్పష్టంచేసింది.

అరకొర సిబ్బందితోనే...

నగరంలో వీధి దీపాల నిర్వహణకు 400 మంది సిబ్బందిని నియమించి, పర్యవేక్షించేందుకు కాంట్రాక్టర్ అంగీకరించారు. కానీ కేవలం 150 మందితోనే పని నడిపించేస్తుండడంతో నగరంలో ప్రతిరోజూ సుమారు 50 వేలకు పైగా వీధిదీపాలు వెలగడం లేదు. దీనివల్ల చీకటిపడితే చాలాప్రాంతాలు అంధకారంలో మగ్గిపోతున్నాయి. ఫలితంగా రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయి. చైన్‌స్నాచింగ్‌లు, ఈవ్‌టీజింగ్, గంజాయి, డ్రగ్స్ వినియోగం జరిగిపోతున్నాయి. రోజుల తరబడి దీపాలు వెలగకపోవడంతో నగరవాసులు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. ఇదే విషయమై ఆయా వార్డు కార్పొరేటర్లను నిలదీస్తున్నారు. ఈ నేపథ్యంలో వారంతా జీవీఎంసీ కౌన్సిల్ సమావేశాల్లో అధికారులను నిలదీస్తున్నారు. కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లిస్తున్నా పరిస్థితి గాడినపడకపోవడంపై ఇటీవల జరిగిన సమావేశంలో కమిషనర్‌ను నిలదీశారు. దీంతో రెండు నెలల్లో గాడిన పెడతానని కమిషనర్ వారికి హామీ ఇచ్చారు.

ఎన్‌ఓసీ ఇస్తేనే బిల్లు

వీధిదీపాల పనితీరును పరిశీలించేందుకు కమిషనర్ సంపత్‌కుమార్ ఇటీవల రాత్రి సమయంలో నగరంలోని పలుప్రాంతాలను సందర్శించారు. వీధిదీపాలు సక్రమంగా వెలగకపోవడంతో సంబంధిత కాంట్రాక్టర్ పనితీరుపై తీవ్రస్థాయిలో అసంతృప్తిని వ్యక్తంచేశారు. నగరంలోని 1.2లక్షల వీధిదీపాల్లో ప్రతి రోజూ కనీసం 1.1 లక్షలైనా వెలగాల్సిందేనని కాంట్రాక్టర్‌కు స్పష్టంచేశారు. ప్రతి వార్డులోని కార్పొరేటర్‌ను కలిసి ఎక్కడెక్కడ వీధిదీపాలు వెలగడం లేదో సమాచారం తీసుకుని, వాటిని వెలిగించిన తర్వాత కార్పొరేటర్‌కు తిరిగి సమాచారం ఇవ్వాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు.

సబ్ కాంట్రాక్టర్‌కు ఇచ్చేసి...

జీవీఎంసీ నుంచి వీధిదీపాల నిర్వహణ కాంట్రాక్టు తీసుకున్న ఏజెన్సీ మరొకరికి సబ్‌కాంట్రాక్టు ఇవ్వడంతో పనులు సక్రమంగా సాగడం లేదు. 400 మంది సిబ్బందిని నియమించుకోవాల్సిన ఏజెన్సీ కేవలం 150 మందితోనే నెట్టుకొస్తోంది. దీనివల్ల పనితీరు మెరుగుపడకపోగా, తీసికట్టుగా మారింది. తాజాగా వీధిదీపాల నిర్వహణకు పార్ట్ బిల్లు జారీచేయాలంటూ కాంట్రాక్టరు కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు. దీంతో బిల్లు చెల్లింపునకు సిద్ధంగానే ఉన్నానని, అయితే సేవలు సంతృప్తిగా ఉన్నాయని అందరు కార్పొరేటర్ల నుంచి ఎన్‌ఓసీ తేవాలని షరతు విధించారు.

కాంట్రాక్టర్ల చుట్టూ ప్రదక్షిణలు

దీంతో ఉలికిపాటునకు గురైన కాంట్రాక్టర్ కార్పొరేటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు. ఇందుకోసం సబ్‌కాంట్రాక్ట్ ఇచ్చిన ఏజెన్సీ ద్వారా కార్పొరేటర్లను కలిసి విజ్ఞప్తి చేస్తున్నారు. వీధిదీపాల పనితీరు తీసికట్టుగా ఉందని, ప్రజలు నిలదీస్తున్నారని కొంతమంది కార్పొరేటర్లు ఎన్‌ఓసీ ఇవ్వడం లేదు. మరికొందరు మాత్రం దీపాలు వెలగకపోయినా ఎన్‌ఓసీలను ఇచ్చేస్తున్నట్టు సమాచారం.



తీరంలోని జలకన్య విగ్రహం వద్ద సందర్శకులు

సందర్శకులతో కళకళలాడిన సాగర తీరం

భీమునిపట్నం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): వారాంతపు రోజైన ఆదివారం వాతావరణం అనుకూలంగా లేకపోయినా సందర్శకులు భీమిలి సాగర తీరానికి అధిక సంఖ్యలో విచ్చేసి ఆనందంగా గడిపారు. తుఫాన్ ప్రభావంతో వాతావరణం చల్లగా మారింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు చిరుజల్లులు కురుస్తూనే ఉన్నా సందర్శకులు తీరానికి వచ్చారు. కడలి కెరటాల చెంత కుటుంబ సభ్యులతో ఉల్లాసంగా.. ఉత్సాహంగా గడిపారు.

ఏజెన్సీ ప్రాంతాల నుంచి బదిలీ చేయాలి

గోపాలపట్నం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): గత ఏడాది జీవో నంబర్-117 వల్ల విద్యాశాఖలో జరిగిన బదిలీల్లో మైదాన ప్రాంతం నుంచి ఏజెన్సీకు వెళ్లిన ఉపాధ్యాయులకు ప్రత్యేక ప్రాధాన్యం కల్పించి మైదాన ప్రాంతాలకు బదిలీ చేయాలని ప్రభుత్వాన్ని కోరనున్నట్టు ఏజెన్సీ ప్రాంత ఉపాధ్యాయులు పేర్కొన్నారు. 2023లో బదిలీ అయిన ఉపాధ్యాయులు స్థానిక జెడ్పీ హైస్కూల్ ప్రాంగణంలో ఆదివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తమ సమస్యలపై వారు చర్చించారు. గతేడాది జరిగిన తప్పనిసరి పరిస్థితుల్లో మైదాన ప్రాంతం నుంచి 350 మంది బదిలీపై వెళ్లారని, వీరిలో 50 ఏళ్లకు పైబడినవారు అధికంగా ఉండడం వల్ల అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. త్వరలో జరగనున్న ఉపాధ్యాయుల బదిలీల్లో ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న ఉపాధ్యాయులకు ప్రాధాన్యతనిచ్చి మైదాన ప్రాంతాలకు బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పి.గణపతి, ఆర్.నారాయణరావు, లెక్కల శ్రీనివాస్, జి.మురళి, ప్రసన్న, తదితరులు పాల్గొన్నారు.

వడ్లపూడిలో రుద్రాభిషేకం

కూర్మన్నపాలెం,డిసెంబరు 1: జీవీఎంసీ 87వ వార్డు పరిధి వడ్లపూడిలో సీతారామ లింగేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మసూత్ర శివలింగం వద్ద కార్తీకమాసం ముగింపు సందర్భంగా ఆదివారం మహా రుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, కార్పొరేటర్ బొండా జగన్, మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య, బీజేపీ 'గాజువాక' కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావుతో పాటు అధిక సంఖ్యలో భక్తులు పూజాది కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆలయ అభివృద్ధికి రూ.6 లక్షలు, వెండి పంచముఖ నాగాభరణాన్ని బీజేపీ నాయకులు బొండా శ్రీదేవి, ఎల్లాజీలు సమర్పించారు.

నూకాంబికకు ప్రత్యేక పూజలు

వేపగుంట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 93వ వార్డు పరిధి ప్రహ్లాదపురంలో నూకాంబిక అమ్మవారికి ఆదివారం అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు చేశారు. మహిళలు ఊరేగింపుగా తెచ్చిన 108 బిందెల పసుపు నీళ్లతో అభిషేకాలు జరిపారు.

గవరపాలెంలో దీపారాధన

పెందుర్తి-రూరల్, డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం ఆఖరి రోజును పురస్కరించుకుని మండలంలోని చింతలఅగ్రహారం గవరపాలెం శ్రీగోపాలకృష్ణ ఆలయ ప్రాంగణంలో ఆదివారం రాత్రి దామోదర హారతి, ఆకాశ దీపారాధనను చేపట్టారు.

'సూపర్ సిక్స్ పేరుతో మోసం'

పెందుర్తి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సూపర్ సిక్స్ పథకాల పేరుతో ప్రజలను మభ్యపెడుతూ సీఎం చంద్రబాబు మోసం చేశారని మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ అన్నారు. రాంపురంలో గల వైసీపీ కార్యాలయంలో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ఎన్నికల హామీలను బుట్టదాఖలు చేశారన్నారు. వలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పిస్తామని కల్లబొల్లి కబుర్లు చెప్పి సీఎం అయ్యాక విస్మరించారన్నారు.

సినిమా గైడ్

- **మెకానిక్ రాఖీ :** మెలోడి, శరత్, కామేశ్వరి, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), లక్ష్మి (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), గణేష్ (తగరపువలస)
- **దేవకీనందన వాసుదేవ :** జగదాంబ, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), శ్రీరాములమ్మ (తగరపువలస)
- **జీబ్రా :** శారద, శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీనరసింహ (గోపాలపట్నం), నటరాజ్-2 (పెందుర్తి), తాతా (తగరపువలస)
- **కంగువా :** సంగం, రమాదేవి, శ్రీరామ, కామేశ్వరి, మౌర్య (గోపాలపట్నం), కన్య కాంప్లెక్స్ (గాజువాక)
- **లక్కీ భాస్కర్:** వెంకటేశ్వర
- **అమరన్:** శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 52, టమాటా 47, వంకాయలు (తెలుపు)32, వంకాయలు (నలుపు) 32, బెండకాయలు 26, పచ్చిమిర్చి 28, కాకరకాయలు 42, బీరకాయలు 38, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 30, క్యాబేజి 30, క్యారెట్ 56 దొండకాయలు 32, బంగాళ దుంపలు 34, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 82, అల్లం (పాతది)50, బరబాటి 32, ముల్లంగి 26, నిమ్మకాయలు (కిలో) 65, గోరుచిక్కుడు 28 దోస కాయలు 26, వెల్లుల్లి (పెద్దవి) 290, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 60, పొటల్స్ 50, కీరదోస 28, కాప్సికమ్ 44, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 44, చిలగడదుంపలు 32, కంద 58, దేముడు చిక్కుడు 78, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 55, కొత్తిమీర (పెద్దకట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 45, మామిడి అల్లం 64, బొప్పాయి 40, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్)	
(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	600
విజయనగరం	604
శ్రీకాకుళం	604

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	100
ఫారం ధర	120
విత్ స్కిన్	210
స్కిన్‌లెస్	220


తుది దశకు చేరుకుంటున్న రాజీవ్ ఇండోర్ స్టేడియం


ప్రారంభానికి సిద్ధమవుతున్న స్విమ్మింగ్‌పూల్ కాంప్లెక్స్

రాజీవ్ ఇండోర్ స్టేడియానికి మహర్దశ

- రూ.8 కోట్లతో చురుగ్గా సాగుతున్న ఆధునికీకరణ పనులు
- మరో రూ.2 కోట్లతో స్విమ్మింగ్‌పూల్ కాంప్లెక్స్ నిర్మాణం

పెదగంట్యాడ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 65వ వార్డు పరిధి వికాస్‌నగర్‌లో రాజీవ్ ఇండోర్ స్టేడియం ఆధునికీకరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక ఈ పనులు మరింత జోరందుకున్నాయి. ఎనిమిది కోట్ల రూపాయలతో స్టేడియం ఆధునికీకరణతో పాటు వాకింగ్ ట్రాక్, మరుగుదొడ్ల సముదాయం, స్టేడియం రూఫింగ్, నాణ్యమైన చెక్కతో ఫ్లోరింగ్, తాగునీటి వసతి కల్పన వంటి ఏర్పాటు చేస్తున్నారు. స్టేడియం చుట్టూ వాకింగ్ ట్రాక్‌ను సిద్ధం చేస్తున్నారు. దీనికి ఆనుకుని ఉన్న అర ఎకరా స్థలంలో మరో రూ.రెండు కోట్లతో స్విమ్మింగ్‌పూల్ కాంప్లెక్సును తీర్చిదిద్దుతున్నారు. ప్రస్తుతం ఈ పనులన్నీ తుది దశకు చేరుకున్నాయి.


ఓపెన్ ఆడిటోరియం..

సుమారు పదిహేనేళ్ల క్రితం అప్పటి మేయర్ పులుసు జనార్దనరావు.. తాను ప్రాతినిధ్యం వహించిన 65వ వార్డులో ఆధునిక హంగులతో ఇండోర్ స్టేడియంను నిర్మించారు. అయితే దీనికి నిర్వహణ పనులు సరిగ్గా చేపట్టకపోవడంతో పలు సమస్యలు ఉత్పన్నమయ్యాయి. స్టేడియంలోని చెక్క ఫ్లోరింగ్ మొత్తం పాడవ్వడం, రూఫింగ్‌కు రంధ్రాలు పడడం, వాకింగ్ ట్రాక్‌గా వేసిన సిమెంట్ పలకలు పైకి లేచిపోవడం, నీటి సరఫరా వ్యవస్థ మొత్తం పాడై మరుగుదొడ్ల సముదాయానికి, గార్డెన్‌కు నీటి సౌకర్యం లేకపోవడంతో స్టేడియం అంతా కళావిహీనంగా మారింది. దీంతో క్రీడాకారులు, వాకర్లు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. అంతేకాక స్టేడియం ఎదురుగా నిర్మించాలనుకున్న స్విమ్మింగ్‌పూల్ అసంపూర్తిగానే మిగిలిపోయింది. పారిశ్రామిక ప్రాంతంలోని పలువురు క్రీడాకారులు, వాకర్ల ఒత్తిడి మేరకు కార్పొరేటర్ బొడ్డు నరసింహపాత్రుడు వికాస్‌నగర్ ఇండోర్ స్టేడియం ఆధునికీకరణ ప్రతిపాదనలను జీవీఎంసీ పాలక వర్గం దృష్టిలో పెట్టారు. ఈ మేరకు రెండేళ్ల క్రితం రూ. ఎనిమిది కోట్లు మంజూరవ్వగా, ఏడాది క్రితం పనులు ప్రారంభించారు. ఈ క్రమంలో స్టేడియం ఎదురుగా అసంపూర్తిగా ఉన్న స్విమ్మింగ్‌పూల్‌ను పూర్తిగా తొలగించారు. స్టేడియం వెనక ఖాళీగా ఉన్న సుమారు అర ఎకరా స్థలంలో కొత్తగా స్విమ్మింగ్‌పూల్‌ను నిర్మిస్తున్నారు. వచ్చే ఏడాది మార్చి నెలాఖరు నాటికి దీని నిర్మాణ పనులు పూర్తవుతాయని, ఆ తర్వాత వెంటనే ఇండోర్ స్టేడియంను వినియోగంలోకి తీసుకువస్తామని జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు.


జన్మదినం సందర్భంగా ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును సత్కరించి శుభాకాంక్షలు తెలియజేస్తున్న చరణ్ గ్రూప్ అధినేత పరంధామనాయుడు (బాబు)


గంటాకు కండువా వేసి స్వామి చిత్రపటాన్ని అందజేస్తున్న సింహాచల దేవస్థానం ఈవో త్రినాథరావు

ఘనంగా ఎమ్మెల్యే గంటా పుట్టినరోజు వేడుకలు

విశాఖపట్నం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పుట్టినరోజు వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఎంవీపీ కాలనీలోని ఆయన స్వగృహంలో సింహాచలం దేవస్థానం ప్రధాన పురోహితుడు గొడవర్తి శ్రీనివాసాచార్యుల నేతృత్వంలో వైదికులు వేదాశీర్వచనం చేశారు. దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ వేండ్ర త్రినాథరావు కండువా వేసి నృసింహస్వామివారి చిత్రపటాన్ని ప్రసాదాన్ని అందజేశారు. సాగర్‌నగర్‌లోని మొగధారమ్మ ఆలయంలో గంటా ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రుషికొండ వెంకటేశ్వరస్వామి ఆలయాన్ని దర్శించుకుని వేదాశీర్వచనం తీసుకున్నారు. ఆలయంలో భక్తుల సౌకర్యాల కల్పనకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అధికారులకు సూచించారు. గంటా ఇంటి వద్ద కార్యకర్తలు, అభిమానుల తాకిడితో కోలాహలంగా మారింది. భీమిలి, విశాఖ సిటీ, పాయకరావుపేట, చోడవరం, అనకాపల్లి తదితర ప్రాంతాల నుంచి


గంటాకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న గంగ్రెడ్డి సోంబాబు, తదితరులు

అభిమానులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు, అభిమానుల సమక్షంలో గంటా కట్ చేశారు. గంటాకు మంత్రి కొండపల్లి శ్రీనివాస్, వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్, ఏపీ అర్బన్ ఫైనాన్స్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ తదితరులు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు.

'గంటా'కు గంగ్రెడ్డి శుభాకాంక్షలు

ఆనందపురం: మండలంలోని గండిగుండానికి చెందిన పారిశ్రామికవేత్త, వుడా మాజీ డైరెక్టర్ గంగ్రెడ్డి సోంబాబు భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. నగరంలోని గంటా స్వగృహంలో ఆయనకు పుష్పగుచ్ఛాన్ని అందజేసి సోంబాబు జన్మదినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారు కాసేపు ఆనందపురంలోని పలు సమస్యలపై చర్చించారు. అలాగే గంటా జన్మదినాన్ని పురస్కరించుకుని కొమ్మాదిలోని అనాథాశ్రమంలో గల 120 మంది చిన్నారులకు దుస్తులు అందజేయడంతో పాటు వారికి భోజన ఏర్పాట్లు చేశారు. గంటాను కలిసిన వారిలో సోంబాబు కుమారులు రమేశ్,ప్రసాద్‌లు ఉన్నారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు

సింధియా, డిసెంబర్ 1 (ఆంధ్రజ్యోతి): నేత్ర వైద్య శిబిరాలను కంటి సమస్యలు ఉన్నవారంతా సద్వినియోగం చేసుకోవాలని పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు కోరారు. ఆదివారం 62వ వార్డు పరిధి గుడివాడ అప్పన్న కాలనీలో గల శివసాయి ఆలయంలో టీడీపీ వార్డు అధ్యక్షుడు మజ్జి మాలినాయుడు ఆధ్వర్యంలో శంకర్ ఫౌండేషన్ సహకారంతో ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ నేత్రాలకు వైద్య పరీక్షలు చేసి మందులు, కళ్లజోళ్లు అందించడమే


శిబిరంలో నేత్ర పరీక్షలు చేయించుకుంటున్న గణబాబు

కాకుండా ఉచితంగా శస్త్ర చికిత్సలు చేస్తున్న శంకర్ ఫౌండేషన్ నిర్వాహకులను అభినందించారు. పలువురు నాయకులు, కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గణబాబును సత్కరించిన మహిళా సంఘాలు

గోపాలపట్నం: పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబును ప్రభుత్వ విప్‌గా నియమించిన సందర్భంగా మహిళా సంఘాల సభ్యులు ఆయనకు అభినందనలు తెలుపుతూ సత్కరించారు. 91వ వార్డు నేతాజీ వీధికి చెందిన డ్వాక్రా సంఘ నాయకురాలు బొడ్డేటి ఉమ ఆధ్వర్యంలో మహిళా సంఘాల సభ్యులు గణబాబును ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి దుశ్శాలువాతో సత్కరించారు.


గాదిరాజు ప్యాలెస్ రోడ్డులో స్తంభించిన ట్రాఫిక్

ప్రయాణికులకు నరక యాతన

- క్రెడాయ్ ప్రాపర్టీ షోతో ట్రాఫిక్ జామ్
- రోడ్డుపైనే వాహనాల పార్కింగ్‌తో సమస్యలు

విశాఖపట్నం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): క్రెడాయ్ ఆధ్వర్యంలో గాదిరాజు ప్యాలెస్‌లో నిర్వహిస్తున్న ప్రాపర్టీ షో వల్ల వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది. రెండు రోజులుగా ఇక్కడ ప్రాపర్టీ షో జరుగుతోంది. ఈ షోకు నగర పరిధిలోని అనేక ప్రాంతాల ప్రజలు వచ్చారు. వీరు తమ వాహనాలను ప్యాలెస్ బయట ఉన్న ఫుట్‌పాత్‌తోపాటు రోడ్డుపైనే పార్కింగ్ చేశారు. దీనివల్ల రాకపోకలు సాగించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది. ప్యాలెస్ ఎదురుగా ఉన్న ఫుట్‌పాత్‌పై బైకులు పార్కింగ్ చేయగా, రోడ్డుపైనే చాలా మంది కార్లు నిలిపేసి వెళ్లిపోయారు. గాదిరాజు ప్యాలెస్‌కు ఇటు, అటు వంద మీటర్ల వరకు దారి వెంబడి కార్లు పార్క్ చేసి వాహనదారులు వెళ్లిపోవడంతో ఈ మార్గంలో ప్రయాణాలు సాగించిన వాహనదారులకు ఇబ్బందులు తప్పలేదు. ఆదివారం కావడంతో ప్రయాణికుల సంఖ్య అధికంగా ఉంది. దీంతో వారంతా ఇబ్బందులు పడ్డారు. వాహనాలు ముందుకు కదలడానికి ఇబ్బంది ఏర్పడింది. రోడ్డుపై ఎక్కడ వాహనం పార్క్ చేసినా హడావిడి చేసే పోలీసులు ఇక్కడ రోడ్డు మొత్తం వాహనాలతో నింపేసినా పట్టించుకోలేదని, ట్రాఫిక్ అంతరాయం ఏర్పడినా చూడలేదని పలువురు వాహనదారులు వాపోయారు.

ఘనంగా నార్ల వెంకటేశ్వరరావు జయంతి

మల్కాపురం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుగా ఎన్నో సంపాదకీయాలు రాసి, ప్రజల పక్షాన నిలిచిన మహా వ్యక్తి దివంగత పాత్రికేయులు నార్ల వెంకటేశ్వరరావు అని షిప్‌యార్డు రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి సుంకర చలపతిరావు అన్నారు. పారిశ్రామిక ప్రాంత విలేకరుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం వైష్ణవి ఫంక్షన్ హాల్‌లో నార్ల వెంకటేశ్వరరావు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్రికారంగంలో గీటురాయి నార్ల వెంకటేశ్వరరావు అని అన్నారు. వైజాగ్ జర్నలిస్టులు ఏకంగా ఆయన పేరు మీద నార్ల వెంకటేశ్వర భవనాన్ని నిర్మించడం అభినందించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో పారిశ్రామిక ప్రాంత విలేకరుల సంఘం అధ్యక్షుడు ఎంవీ గిరి, కోశాధికారి ఎల్.రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఐఐఎం మెమోరియల్ అవార్డుకు రూ.5 లక్షల వితరణ

విశాఖపట్నం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం)లో దివంగత మోటపర్తి రామచంద్రమ్మ పేరుతో మెమోరియల్ అవార్డు అందించేందుకు వీలుగా అతని కుటుంబసభ్యులు రూ.5.25 లక్షలను అందించారు. ప్రముఖ పారిశ్రామికవేత్త, విద్యావేత్త మోటపర్తి రావు ఆమె తల్లి మోటపర్తి రామచంద్రమ్మ పేరుతో ఈ అవార్డు అందించేందుకు ఐఐఎం డైరెక్టర్ ప్రొఫెసర్ చంద్రశేఖర్‌కు చెక్కు అందించారు. ఎంబీఏ ఫైనాన్స్ అండ్ అకౌంటింగ్‌లో ప్రతిభ కనబర్చిన యువతికి ఈ మొత్తంపై వచ్చే వడ్డీని క్యాష్ అవార్డుగా, మెరిట్ సర్టిఫికెట్ అందిస్తారు.

మూఢనమ్మకాలపై కలమెత్తిన 'గురజాడ'

పెదగంట్యాడ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సమాజంలోని మూఢనమ్మకాలపై మహాకవి గురజాడ అప్పారావు తన కలాన్ని సంధించారని, ఆయన రచనలు సమాజాన్ని ఎంతో ప్రభావితం చేశాయని నటాలి నాటక సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు కొత్తపల్లి బంగార్రాజు అన్నారు. ఆదివారం వినాయకనగర్‌లోని సంస్థ కార్యాలయంలో నిర్వహించిన గుజాడ వర్థంతి కార్యక్రమానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. గురజాడ రాసిన కన్యాశుల్కం నాటకం నాటి నుంచి నేటి వరకు సమాజ పోకడలకు అన్వయమవుతుందన్నారు. అనంతరం ప్రముఖ రచయిత కేవీ రామారావును ఘనంగా సత్కరించారు. ముందుగా నటాలి నాటక సంస్థ సభ్యులు గురజాడ అప్పారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంస్థ సభ్యులు తమిరెడ్డి శివప్రసాదరావు, ఎ.కొండలరావు, ఎ.సత్యనారాయణ, భీమ సాహు, తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న కరణంరెడ్డి నరసింగరావు, తదితరులు

హెచ్ఐవీ బాధితుల పట్ల ప్రేమగా ఉండాలి

బీజేపీ 'గాజువాక' కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు

గాజువాక, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): హెచ్ఐవీ బాధితుల పట్ల ప్రేమానురాగాలు చూపాలని బీజేపీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు అన్నారు. గాజువాక డిజైర్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ర్యాలీకి ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్ఐవీ బాధితుల పట్ల ప్రేమ చూపిస్తే వారిలో ఆత్మస్థైర్యాన్ని పెంచవచ్చన్నారు. కార్యక్రమంలో డిజైర్ సొసైటీ సిబ్బంది పి.లక్ష్మణ, స్థానిక నాయకులు పరుశురాం, విజయ్‌కుమార్, పూర్ణిమ, రజనీకుమారి, జగదీశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

పెందుర్తి: ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా స్థానిక సీహెచ్‌సీ ఐసీటీసీ ఆధ్వర్యంలో ఆదివారం పెందుర్తిలో హెచ్ఐవీపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ఐసీటీసీ కౌన్సెలర్ సురేశ్‌కుమార్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజం నుంచి ఎయిడ్స్ మహమ్మారిని పారద్రోలాలన్నారు. అనంతరం కూడలిలో విద్యార్థులు, ఆరోగ్య సిబ్బంది మానవహారంగా ఏర్పడి ఎయిడ్స్ రహిత సమాజం కోసం ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి బాబా, తదితరులు పాల్గొన్నారు.

అగనంపూడి: ఎయిడ్స్ రహిత సమాజ స్థాపనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని స్థానిక ఏరియా ఆస్పత్రి వైద్యురాలు సంతోషీస్వరూప పిలుపునిచ్చారు. ఏరియా ఆస్పత్రి ఐసీటీసీ విభాగం ఆధ్వర్యంలో హెచ్ఐవీపై అవగాహన ర్యాలీని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిఒక్కరు బాధ్యతగా భావించి ఎయిడ్స్ నిర్మూలనకు కృషి చేయాలన్నారు. హెచ్ఐవీ రోగులకు అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఐసీటీసీ కౌన్సెలర్ రవికుమార్, కళావతి, స్థానిక నాయకులు బి.సత్యనారాయణ, జి.అప్పారావు, హనుమంతరావు, శ్రీనివాసరావు, ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు. అలాగే దువ్వాడ విజ్ఞాన్ ఫార్మసీ కళాశాలలో ఎయిడ్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు హెచ్ఐవీ రిబ్బన్ ఆకృతిలో మానవహారంగా ఏర్పడి ఎయిడ్స్ వంటి ప్రాణాంతక వ్యాధుల పట్ల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని నినాదాలు చేశారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వై.శ్రీనివాసరావు, ఎన్ఎస్ఎస్ అధికారి సత్యలక్ష్మీ, అధ్యాపక సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


రెడ్ రిబ్బన్ ఆకృతిలో విజ్ఞాన్ ఫార్మసీ విద్యార్థులు

వీరభద్రరావు మాస్టారు సంస్మరణ సభ


సంస్మరణ సభలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

పెందుర్తి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సరిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా పనిచేసిన దివంగత విశ్రాంత ప్రధానోపాధ్యాయులు కూరాడ వీరభద్రరావు సంస్మరణ సభను ఆదివారం నిర్వహించారు. సరిపల్లిలోని వీరభద్ర యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పూర్వ విద్యార్థుల సౌజన్యంతో స్థానిక జెడ్పీ పాఠశాల ప్రాంగణంలో జరిగిన సంస్మరణ సభలో అధిక సంఖ్యలో పూర్వ విద్యార్థులు పాల్గొని వీరభద్రరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నిరంతర స్ఫూర్తిప్రదాతగా విద్యార్థుల ఉన్నతికి వీరభద్రరావు మాస్టారు చేసిన కృషి, సేవలను కొనియాడారు. సరిపల్లిలో నిర్మించనున్న క్రీడా మైదానానికి వీరభద్రరావు మాస్టారు పేరు పెట్టాలని పూర్వ విద్యార్థులు కోరారు.

స్టీల్‌ప్లాంట్ సీజీఎం (వర్క్స్)గా రాజన్ మహంతి

ఉక్కుటౌన్‌షిప్, డిసెంబరు 1: స్టీల్‌ప్లాంట్ సీజీఎం (వర్క్స్)గా రాజన్ మహంతిని యాజమాన్యం నియమిస్తూ ఆదివారం ఉత్తర్వులు విడుదల చేసింది. ఇప్పటివరకు సీజీఎంగా విధులు నిర్వర్తించిన శ్రీధర్ పదవీ విరమణ చేయడంతో ఆయన స్థానంలో సీజీఎం (ఐరన్, స్టీల్, యూటీఎల్)గా ఉన్న మహంతిని నియమించింది.

భద్రాద్రి చేరుకున్న కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి


భద్రాద్రి రామాలయ ఆవరణలో కాకి గోవిందరెడ్డి, తదితరులు

భద్రాచలం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): విశాఖ నుంచి భద్రాద్రి రామయ్య చెంతకు 69వ వార్డు కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి, పలువురు టీడీపీ నాయకులు చేపట్టిన పాదయాత్ర ఆదివారం భద్రాచలం చేరుకుంది. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు మళ్లీ ముఖ్యమంత్రి అయితే భద్రాచలం వస్తానని గోవిందరెడ్డి మొక్కుకోవడంతో దానిని తీర్చుకున్నారు. తన పాదయాత్రకు సహకరించిన వారందరికీ గోవిందరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

అల్లరిమూకలను నియంత్రించాలని మంత్రికి వినతి

పెదగంట్యాడ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పెదగంట్యాడ ప్రాంతంలో అల్లరి మూకల బెడద ఎక్కువగా ఉందని, వీరిని నియంత్రించేందుకు చర్యలు చేపట్టాలని కోరుతూ టీడీపీ జిల్లా


మంత్రి అనితతో వెంకటరమణారెడ్డి, తదితరులు

ఉపాధ్యక్షుడు పులి వెంకటరమణారెడ్డి, సీనియర్ నాయకుడు ములకల పెంటయ్యలు రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనితకు ఆదివారం నగరంలో వినతిపత్రం అందజేశారు. ప్రధానంగా సాయంత్రం వేళల్లో ప్రధాన రోడ్ల కూడళ్లలో, వీధి శివారు ప్రాంతాల్లో అల్లరిమూకలు ఉంటూ యువతులు, మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారని వివరించారు. అలాగే అన్ని ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని కోరారు.

గౌరీ సేవా సంఘం అధ్యక్షునిగా పరమేశ్వరరావు

పెందుర్తి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పెందుర్తి గౌరీ సేవా సంఘం అధ్యక్షునిగా వేగి పరమేశ్వరరావు నియమితులయ్యారు. స్థానిక గౌరీ కల్యాణ మండపంలో ఆదివారం జరిగిన సంఘ సమావేశంలో ఆయనను ఏకగ్రీవంగా సభ్యులు ఆమోదించారు. అనంతరం పరమేశ్వరావు, పూర్వ అధ్యక్షుడు దాడి రమణ చిట్టిలను సభ్యులు సత్కరించారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద్, జీవీఎంసీ టీడీపీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వేగి దివాకర్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ శరగడం నర్సింహమూర్తి, ఆళ్ల సత్తిబాబు, ఆళ్ల రాము, తదితరులు పాల్గొన్నారు

అంతర్ కళాశాలల పురుషుల ఫుట్‌బాల్ టోర్నీ ప్రారంభం



టోర్నీలో పాల్గొనే క్రీడాకారులు

విశాఖపట్నం స్పోర్ట్స్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఏయూ అంతర్ కళాశాలల పురుషుల ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ టోర్నీ, ఆంధ్ర విశ్వవిద్యాలయం జట్టు ఎంపికలు ప్రారంభమయ్యాయి. గోల్డెన్ జూబ్లీ గ్రౌండ్‌లో జరుగుతున్న ఈ పోటీలను ఏయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇ.ఎన్.ధనుంజయరావు ప్రారంభించారు. ఏయూ సమకూర్చిన సదుపాయాలు, వివిధ ప్రోత్సాహాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత క్రీడాకారులుగా రూపొందాలని ఆయన ఆకాంక్షించారు. వ్యాయామ విద్య క్రీడా శాస్త్రం సంచాలకులు ఆచార్య ఎస్.విజయ్‌మోహన్ మాట్లాడుతూ రెండు రోజులు జరిగే ఈ టోర్నీలో ఏయూ పరిధిలోని ఆరు జట్లు పాల్గొంటున్నాయని తెలిపారు. సోమవారం ప్రత్యేకంగా మ్యాచ్‌లు నిర్వహించి సౌత్‌జోన్ అంతర్ వర్సిటీల ఫుట్‌బాల్ టోర్నీలో పాల్గొనేందుకు ప్రతిభ గల క్రీడాకారులను ఆంధ్ర విశ్వవిద్యాలయం జట్టుకు ఎంపిక చేస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో ఏయూ ఫుట్‌బాల్ జట్టు సెలక్షన్ కమిటీ సభ్యుడు డాక్టర్ బీఆర్ఎస్ లక్ష్మణరెడ్డి, ఐఏపీఈ క్రీడాధికారి డాక్టర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

గీతా పఠన పోటీలు

జగదాంబ కూడలి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గీతాజయంతిని పురస్కరించుకుని ఆదివారం గీతాప్రచార సమితి నిర్వహించిన పోటీల్లో విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. ప్రత్యక్షంగా 250 మంది, ఆన్‌లైన్‌లో 150 మంది పాల్గొన్నారు. గీతాప్రచార సమితి అధ్యక్షుడు చావలి విశ్వేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి భగవద్గీత శ్లోకాలు పఠించడం ద్వారా భక్తి, సంస్కారం, విజ్ఞానం అలవడతాయన్నారు. పోటీల్లో విద్యార్థులు ప్రతిభను చాటడం ఆనందదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో ఆధ్యాత్మిక వేత్త ఎం.వి.రాజశేఖర్, ప్రచార కార్యదర్శి ఎం.వనజాదేవి, కోశాధికారి జీవీఆర్ ప్రసాద్, జి.లక్ష్మీనరసింహ పాల్గొన్నారు.

మర్రిపాలెం రైల్వే క్వార్టర్స్‌లో ఉద్యోగ సంఘాల ఎన్నికల ప్రచారం

మర్రిపాలెం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 4, 5 తేదీల్లో జరగనున్న గుర్తింపు సంఘ ఎన్నికల్లో తమ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ ఆదివారం ఈస్ట్‌కోస్ట్ రైల్వే శ్రామిక్ కాంగ్రెస్ నాయకులు, ఉద్యోగులు మర్రిపాలెంలోని దక్షిణ, ఉత్తర బ్లాక్ రైల్వే క్వార్టర్లలో ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించారు. కార్మికుల పక్షాన నిరంతరం పోరాడుతూ, సమస్యల పరిష్కారానికి గళమెత్తుతున్న శ్రామిక్ కాంగ్రెస్ అభ్యర్థులను జెండా పట్టిన కార్మికుల గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ పాపారావు, కింతలి నారాయణమూర్తి, సనపల శ్రీనివాసరావు, మూల మహేశ్వరరావు, కార్యదర్శి ఎస్.రాజశేఖర్, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ఎలక్ట్రీషియన్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

కంచరపాలెం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కంచరపాలెం ప్రభుత్వ పాత ఐటీఐ ప్రాంగణంలోని స్కిల్‌హబ్ ఆధ్వర్యంలో ఉచిత ఎలక్ట్రీషియన్ సర్వీస్, టెక్నీషియన్ కోర్సులో చేరడానికి అర్హులైన నిరుద్యోగ యువత దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ జె.శ్రీకాంత్ కోరారు. మూడు నెలల వ్యవధి గల కోర్సులో చేరడానికి పదో తరగతి ఉత్తీర్ణులైన వారు అర్హులని తెలిపారు. శిక్షణ అనంతరం ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. నిరుద్యోగులు ఐటీఐ ప్రాంగణంలోని స్కిల్ హబ్ కేంద్రంలో సంప్రదించాలని సూచించారు. వివరాలకు 77025 06614 ఫోన్ నెంబరులో సంప్రదించాలన్నారు.

వ్యాస సంపుటి ఆవిష్కరణ

మహారాణిపేట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): విశాలాంధ్ర పుస్తక మహోత్సవంలో భాగంగా ఆచార్య పెలమల సిమ్మన్న రచించిన సాహితి మంజూష వ్యాస సంపుటిని ఆదివారం సాయంత్రం ఆవిష్కరించారు. టర్నర్ చౌల్ట్రీ హాల్‌లో నిర్వహించిన సభకు విశాఖ సాహితీ ఉపాధ్యక్షులు డాక్టర్ కందాళ కనక మహాలక్ష్మి అధ్యక్షత వహించి మాట్లాడారు. ఆచార్య సిమ్మన్న సామాజిక ప్రయోజనం కలిగించేవి, విద్యార్థులకు ఉపకరించే రచనలు చేశారని అభినందించారు సిమ్మన్న పుస్తకాన్ని రచయితల సంఘం రాష్ట్ర కార్యదర్శి ఉప్పల అప్పలరాజుకు అంకితమిచ్చారు.

నేటి నుంచి మార్గశిర మాసోత్సవాలు

» కనకమహాలక్ష్మికి తొలి పూజ ఉదయం 8.30 గంటలకు » హాజరు కానున్న దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్



ఆలయం వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ

జగదాంబ కూడలి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): శ్రీకనకమహాలక్ష్మి అమ్మవారి మార్గశిర మాసోత్సవాలు సోమవారం నుంచి అంగరంగ వైభవంగా ప్రారంభం కానున్నాయి. ఈ నెలాఖరు వరకు ఉత్సవాల నిర్వహణకు దేవాదాయ శాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. ఉదయం 8.30 గంటలకు దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ తొలి పూజ చేసి ఉత్సవాలను ప్రారంభిస్తారు. 5న అర్ధరాత్రి 12.01 గంటలకు తొలి గురువారం మొదటి పూజ, పంచామృతాభిషేకం సేవ చేసి దర్శనాలకు అవకాశం కల్పిస్తారు. 12, 19, 26 తేదీల్లో వచ్చే మూడు గురువారాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఈవో కె.శోభారాణి చర్యలు చేపట్టారు. టిక్కెట్, ఉచిత దర్శనాలకు వేర్వేరుగా క్యూలైన్లు ఏర్పాటు చేశారు. ఆలయం వద్ద పోలీసుల పర్యవేక్షణ ఉంటుంది.

ఏర్పాట్లపై దక్షిణ ఎమ్మెల్యే ఆరా: మార్గశిర మాసోత్సవాల ఏర్పాట్లను దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ ఆదివారం పరిశీలించారు. ఆయన అమ్మవారి ఆలయానికి విచ్చేసి క్యూలైన్లు పరిశీలించారు. రీడింగ్ ముఖద్వారం వద్ద డిజిటల్ ఎలక్ట్రానిక్ బోర్డుల ద్వారా టిక్కెట్ రేట్ల వివరాలు ప్రదర్శిస్తామని ఈవో, ఇంజనీరు రమణ తెలియజేశారు. టౌన్‌కొత్త రోడ్డు మార్గం నుంచి ఎవరినీ అనుమతించకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. విక్టోరియా ఆసుపత్రి వైపు క్యూలైన్లు, పార్కింగ్ స్థలం విషయమై ఎమ్మెల్యే అధికారులకు పలు సూచనలు చేశారు. సామాన్య భక్తులకు ఇబ్బందులు లేకుండా దర్శనాలు జరిగేలా ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. రీడింగ్ రూమ్ వద్ద కొబ్బరి కాయలు, పూజా సామగ్రి విక్రయించే వ్యాపారులు క్యూలైన్లు, బారికేడ్ల వల్ల తమ వ్యాపారాలకు ఇబ్బందులు కలుగుతాయని ఆయన దృష్టికి తీసుకురాగా, వారికి సహకరించాలని అధికారులను ఆదేశించారు.

కనకమహాలక్ష్మికి పూజలు: కనకమహాలక్ష్మి అమ్మవారికి దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ ప్రత్యేకంగా పూజలు జరిపారు. ఆలయ సంప్రదాయం ప్రకారం దేవాలయ అధికారులు స్వాగతం పలికారు. అర్చకులు ఆయనతో అమ్మవారికి ప్రత్యేకంగా పూజలు చేయించారు. అనంతరం మండపంలో ఎమ్మెల్యేకు వేదపండితులు ఆశీర్వచనాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఈవో శోభారాణి, కూటమి నాయకులు బోదపాటి ఉమామహేశ్వరరావు, గోడి నరసింహాచారి, జె.ప్రసాద్, త్రినాథ్ ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడలకు ప్రభుత్వ ప్రోత్సాహం: మంత్రి కొండపల్లి



మంత్రి కొండపల్లి శ్రీనివాస్, కబడ్డీ సంఘానికి రాష్ట్ర అధ్యక్షునిగా ఎన్నికైన ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్‌లకు పూలమాలతో సత్కరిస్తున్న అభిమానులు

విశాఖపట్నం స్పోర్ట్స్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ క్రీడగా ప్రాచుర్యం పొందిన కబడ్డీని జాతీయ, అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లేందుకు ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రవేశపెట్టిన క్రీడా విధానం దోహదపడుతుందని రాష్ట్ర చిన్న, మధ్యతరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అభిప్రాయపడ్డారు. రెండు క్రీడా విశ్వవిద్యాలయాల ఏర్పాటుకు ప్రభుత్వం ముందుకు రావడం క్రీడాకారులకు మంచి అవకాశమని అన్నారు. ఆంధ్రప్రదేశ్ కబడ్డీ సంఘం నూతన అధ్యక్షుడిగా దక్షిణ శాసనసభ్యుడు వంశీకృష్ణ శ్రీనివాస్, గౌరవ అధ్యక్షునిగా, చైర్మన్‌గా గాజువాక శాసనసభ్యుడు పల్లా శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా పి.పద్మజ బాల, కార్యనిర్వాహక కార్యదర్శిగా ఉరుకూటి శ్రీనివాసరావు, సీఈవోగా వీర లంకయ్యలు ఎన్నికయ్యారు. ఆదివారం నగరంలో కార్యవర్గ సభ్యులను మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ప్రకటించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం క్రీడా సంఘాలను నిర్వీర్యం చేసి వారి భవిష్యత్తును తుంగలో తొక్కగా, కూటమి ప్రభుత్వం క్రీడాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఆంధ్ర కబడ్డీ లీగ్ (ఏకేఎల్) నిర్వహణకు తమ వంతు సహాయం చేస్తామన్నారు. అకాడమీల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. నూతన అధ్యక్షుడు వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ నూతన క్రీడా విధానాన్ని క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వివిధ జిల్లాల ప్రతినిధులు పాల్గొని చేపట్టాల్సిన కార్యకలాపాలపై పలు తీర్మానాలు చేశారు.

డయేరియాకు తాగునీరు కారణం కాదు: కమిషనర్



జబ్బర్‌తోటలో నీటి నమూనాను పరీక్షిస్తున్న జీవీఎంసీ సిబ్బంది

విశాఖపట్నం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 37వ వార్డు జబ్బర్‌తోటలో నమోదైన డయేరియా కేసులకు తాగునీరు కలుషితమన్న ఆరోపణలు వాస్తవం కాదని జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్ తెలిపారు. ఈ ప్రాంతాలకు సరఫరా చేస్తున్న తాగునీటి నమూనాలను గతనెల 26, 28 తేదీల్లో పరీక్ష చేయించామన్నారు. తాగునీరు సురక్షితమేనని నిర్ధారించడంతో అనుమానాలకు తెరపడిందన్నారు. రోజూ సరఫరా చేస్తున్న నీటిలో క్లోరిన్ శాతాన్ని జీవీఎంసీ ల్యాబ్‌లలో పరీక్షిస్తున్నామన్నారు. ప్రజలు నిర్భయంగా ఈ నీటిని తాగవచ్చునన్నారు. కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలని కమిషనర్ సూచించారు.

మానసిక సమస్యకూ వైద్యం



సదస్సును జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న డాక్టర్ సుబ్బారావు, పాల్గొన్న ఇతర వైద్యులు

విశాఖపట్నం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా మానసిక సమస్యల బారినపడుతున్న వారి సంఖ్య పెరిగిందని, ఇలాంటి వారికి మెరుగైన వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని వైద్య నిపుణులు పేర్కొన్నారు. ఏపీ మానసిక వైద్యుల సంఘం ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ జంక్షన్‌లోని అంకోసా హాల్‌లో పీజీ వైద్యుల (మానసిక విభాగం) నిరంతర వైద్య విద్యా సదస్సు ఆదివారం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న నిపుణులు మాట్లాడుతూ మానసిక సమస్యలపై అనేక అపోహలున్నాయని, వాటిని నివృత్తి చేసేందుకు సదస్సులు దోహదపడతాయన్నారు. అదే సమయంలో ప్రపంచ వ్యాప్తంగా నమోదవుతున్న సరికొత్త మానసిక సమస్యలు, అందిస్తున్న నూతన వైద్య పద్ధతులపై చర్చించేందుకు ఉపకరిస్తాయన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజు, విశ్రాంత డీఎంఈ, గాయత్రీ విద్యాపరిషత్ డీఎంఈ డాక్టర్ ఎస్.సుబ్బారావు, అఖిల భారత మానసిక వైద్యుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జీవీఎస్ మూర్తి, సదస్సు ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ ఎన్ఎన్ రాజు, కార్యదర్శి డాక్టర్ నిహాల్, ప్రముఖ మానసిక వైద్య నిపుణులు డాక్టర్ రామసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేరళ కళాసమితిలో ఉచిత వైద్య సేవలు



వైద్యశిబిరంలో చికిత్సలు చేస్తున్న దృశ్యం

మురళీనగర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మురళీనగర్ కేరళ కళా సమితిలో ఆదివారం ఉచిత వైద్య సేవల శిబిరం నిర్వహించారు. రక్తదాన శిబిరాన్ని కూడా ఏర్పాటు చేశారు. దాతల సాయంతో 28 యూనిట్ల రక్తాన్ని ఎ.ఎస్.రాజా రక్తనిధి (బ్లడ్ బ్యాంక్) కేంద్రానికి అందజేసినట్లు కేరళ కళా సమితి అధ్యక్షుడు మణి ఉన్నితన్ తెలిపారు. వైద్య సేవల శిబిరంలో కార్డియాక్, ఆర్థోపెడిక్, ఈఎన్‌టీ పరీక్షలతో పాటు నేత్ర వైద్య సేవలు అందించినట్లు తెలిపారు. ఆరుగురికి చక్రాల కుర్చీలు ఇచ్చారు. బిర్లా జంక్షన్ హైవే రోడ్డులో ఉన్న కేరళ కళాసమితి భవనంలో ఆదివారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

పోలిపాడ్యమికి ఏర్పాట్లు

అక్కయ్యపాలెం/మాధవధార, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం ముగింపు సందర్భంగా సోమవారం జరిగే పోలి పాడ్యమి దీపోత్సవానికి మురళీనగర్ రామాలయ సన్నిధిలోని శివాలయంలోనూ, రామకృష్ణానగర్‌లోని రామలింగేశ్వరాలయంలో ఏర్పాట్లు చేసినట్లు ఆలయాల కమిటీ ప్రతినిధులు తెలిపారు. రామలింగేశ్వర స్వామిని వివిధ రకాల పూలతో అలంకరించారు. సోమవారం తెల్లవారు జామున ఆలయ ఆవరణలో దీపాలు వదిలేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. భక్తులకు దీపాల కొలను సిద్ధం చేసినట్లు మురళీనగర్‌లో ఆలయ కార్యదర్శి సనపల వరప్రసాద్ తెలిపారు. మహిళలకు ఉదయం 3 గంటల నుంచే ఆలయంలో అర్చకులు, కమిటీ సభ్యులు సహాయక చర్యలు అందిస్తారని ఆయన తెలిపారు.

భీమిలి రెవెన్యూ అసోసియేషన్ కార్యవర్గం



కొత్త కార్యవర్గ సభ్యులు వీరే

విశాఖపట్నం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఏపీ రెవెన్యూ అసోసియేషన్ భీమిలి డివిజన్‌కు కొత్త కార్యవర్గం ఎన్నిక ఆదివారం ఏకగ్రీవంగా జరిగింది. అధ్యక్షునిగా ఆనందపురం డీటీ ఎల్.చేతన్‌కుమార్, అసోసియేట్ అధ్యక్షునిగా భీమిలి డీటీ కె.సుధాకర్, ఉపాధ్యక్షులుగా ఎ. వెంకటేష్ (భీమిలి ఆర్డీవో కార్యాలయం), ఎల్.లోకేశ్ (ఆనందపురం తహసీల్దారు కార్యాలయం), డి.శ్యామల (పద్మనాభం తహసీల్దారు కార్యాలయం), కార్యదర్శిగా పద్మనాభం డీటీ సీహెచ్. రవికుమార్, సంయుక్త కార్యదర్శులుగా టి.మల్లేశ్వరరావు, ఏవీ కిశోర్ (విశాఖ రూరల్), ముస్తాఫా(ఆనందపురం), కోశాధికారిగా ఎస్‌కే. అబ్రహం (సీతమ్మధార), కార్యవర్గ సభ్యులుగా టి.రామచంద్, పి.జ్ఞానదీప్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. విశాఖ సిటీ అధ్యక్షుడు బీవీఏఎస్ నియోగి, జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్ఎం జిలాని ఎన్నికలు నిర్వహించారు.

అధునాతన వైద్యంతో హెచ్‌ఐవీ నియంత్రణ

కంచరపాలెం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్ రోగులు కూడా అధునాతన వైద్య చికిత్స ద్వారా సాధారణ వ్యక్తులుగా జీవించవచ్చని ప్రముఖ వైద్యుడు డా.కూటికుప్పల సూర్యారావు పేర్కొన్నారు. కంచరపాలెంలోని సూర్య ఆసుపత్రి ప్రాంగణంలో ఆదివారం వైజ్ఞానిక సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డా.కూటికుప్పల సూర్యారావు మాట్లాడుతూ మూడు దశాబ్దాల క్రితం ప్రపంచాన్ని వణికించిన ఎయిడ్స్ వ్యాధికి అత్యాధునిక మందులు అందుబాటులోకి వచ్చాయన్నారు. పేదలకు ఉచిత వైద్యపరీక్షలు నిర్వహించారు. డా.సుభాదేవి, డా.లక్ష్మి కొండమ్మ, డా.అచ్యుతరావు, డా.కవిత, సిబ్బంది పాల్గొన్నారు.

'రుషికొండ ప్యాలెస్‌ను వినియోగంలోకి తేవాలి'



సమావేశంలో పాల్గొన్న వివిధ సంస్థల ప్రతినిధులు

సీతమ్మధార, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రుషికొండ ప్యాలెస్ భవనాలను తక్షణమే వినియోగంలోకి తెచ్చేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకునేందుకు స్థానిక స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో కమిటీని ఏర్పాటు చేసి సూచనలు స్వీకరించాలని పలువురు విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వం రుషికొండలో నిర్మించిన భవనాలు వినియోగించకపోతే నష్టపోవడం తప్ప మరే ప్రయోజనం ఉండదని వారు అభిప్రాయపడ్డారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో ఆదివారం వివిధ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశాన్ని నవర ప్రకాశరావు అధ్యక్షతన నిర్వహించారు. బౌద్ధ సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ దీన్ని మ్యూజియంగా మార్చాలని కోరారు. ప్రభుత్వంపై నిర్వహణ భారం పడకుండా విడివిడిగా ఈ భవంతులను లు కార్యక్రమాల నిమిత్తం కేటాయించాలని పేర్కొన్నారు. సామాజిక విశ్లేషకుడు సన్‌మూర్తి మాట్లాడుతూ ప్రైవేటు కాంట్రాక్టుకు ఇచ్చి నిర్వహణ చేపట్టాలని సూచించారు. ఒకటి, రెండు భవనాలను పర్యాటక వసతి గృహంగా, మరో రెండు భవనాలను చిత్ర పరిశ్రమ చిత్రీకరణకు అనుగుణంగా, ఇంకో రెండింటిని పురావస్తు భద్రతా కేంద్రాలుగా తీర్చిదిద్దాలని, ఇంకో భవనాన్ని వీఐపీల ఆతిథ్యానికి మార్చాలన్నారు. ఆచార్య బాల మోహన్‌దాస్, మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ, ప్రముఖ జర్నలిస్ట్ శివశంకర్, ఆచార్య ముత్యాలరావు, జయశ్రీ, హుస్సేన్, శ్యాంప్రసాద్, డాక్టర్ బాబ్జి, శీతల్, చిన్నారావు, మేడా మస్తాన్‌రెడ్డి, మూర్తి పాల్గొన్నారు.

ఎవరూ హెచ్‌ఐవీ బారిన పడకూడదు: కలెక్టర్



ఎయిడ్స్ నివారణపై గోడప్రతిని ప్రదర్శిస్తున్న కలెక్టర్, ఇతర అధికారులు

మహారాణిపేట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): హెచ్‌ఐవీ సోకిన వారిని ఎలాంటి వివక్ష లేకుండా సమాజంలో కలుపుకుపోవటమే ధ్యేయంగా ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినం సందర్భంగా ఆదివారం ప్రభుత్వ శాఖలు, ప్రభుత్వేతర సంస్థలు, నర్సింగ్ విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల కార్యకర్తలు సంయుక్తంగా ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ కలెక్టర్ కార్యాలయం నుంచి ఆంధ్ర వైద్య కళాశాల వరకు కొనసాగి అక్కడ మానవహారంగా ఏర్పడి విద్యార్థులు నినాదాలు చేశారు. సాంస్కృతిక ప్రదర్శన నిర్వహించారు. ఈ ఏడాది 'హక్కుల మార్గాన్ని అనుసరించండి.. నా ఆరోగ్యం-నా హక్కు' అన్న ఆశయంతో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. ఏ ఒక్కరూ హెచ్‌ఐవీ బారిన పడకుండా చేయటమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. జిల్లాలో ఎయిడ్స్ నివారణకు చేపడుతున్న చర్యలు, కార్యక్రమాలు, వివిధ సంస్థలు అందిస్తున్న సేవలను గణాంక సహితంగా వివరించారు. అధిక రక్తపోటు, చక్కెర వ్యాధి, వివిధ రుగ్మతలకు అందిస్తున్న సేవలకు సంబంధించిన గోడప్రతులను ఆవిష్కరించారు. బీచ్‌రోడ్డులో ఆంధ్ర వైద్య కళాశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ సేవలు అందించించిన వారికి ప్రశంసాపత్రాలను అందించారు. డీఎల్ఎస్ఏ ఎంవీ శేషమ్మ, జిల్లా వైద్యాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్, ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజు, డాక్టర్ కృష్ణవేణి, మాధవీలత పాల్గొన్నారు.

లైట్లు వెలిగితేనే... బిల్లు!

... 5వ పేజీ తరువాయి

రోజుకి రూ.50 చొప్పున జరిమానా చెల్లించాల్సి ఉంటుందని స్పష్టంచేసింది.

అరకొర సిబ్బందితోనే...

నగరంలో వీధి దీపాల నిర్వహణకు 400 మంది సిబ్బందిని నియమించి, పర్యవేక్షించేందుకు కాంట్రాక్టర్ అంగీకరించారు. కానీ కేవలం 150 మందితోనే పని నడిపించేస్తుండడంతో నగరంలో ప్రతిరోజూ సుమారు 50 వేలకు పైగా వీధిదీపాలు వెలగడం లేదు. దీని వల్ల చీకటిపడితే చాలాప్రాంతాలు అంధకారంలో మగ్గిపోతున్నాయి. ఫలితంగా రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయి. చైన్‌స్నాచింగ్‌లు, ఈవ్‌టీజింగ్, గంజాయి, డ్రగ్స్ వినియోగం జరిగిపోతున్నాయి. రోజుల తరబడి దీపాలు వెలగకపోవడంతో నగరవాసులు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. ఇదే విషయమై ఆయా వార్డు కార్పొరేటర్లను నిలదీస్తున్నారు. ఈ నేపథ్యంలో వారంతా జీవీఎంసీ కౌన్సిల్ సమావేశాల్లో అధికారులను నిలదీస్తున్నారు. కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లిస్తున్నా పరిస్థితి గాడినపడకపోవడంపై ఇటీవల జరిగిన సమావేశంలో కమిషనర్‌ను నిలదీశారు. దీంతో రెండు నెలల్లో గాడిన పెడతానని కమిషనర్ వారికి హామీ ఇచ్చారు.

ఎన్ఓసీ ఇస్తేనే బిల్లు

వీధిదీపాల పనితీరును పరిశీలించేందుకు కమిషనర్ సంపత్‌కుమార్ ఇటీవల రాత్రి సమయంలో నగరంలోని పలుప్రాంతాలను సందర్శించారు. వీధిదీపాలు సక్రమంగా వెలగకపోవడంతో సంబంధిత కాంట్రాక్టర్ పనితీరుపై తీవ్ర స్థాయిలో అసంతృప్తిని వ్యక్తంచేశారు. నగరంలోని 1.2లక్షల వీధిదీపాల్లో ప్రతి రోజూ కనీసం 1.1 లక్షలైనా వెలగాల్సిందేనని కాంట్రాక్టర్‌కు స్పష్టంచేశారు. ప్రతి వార్డులోని కార్పొరేటర్‌ను కలిసి ఎక్కడెక్కడ వీధిదీపాలు వెలగడం లేదో సమాచారం తీసుకుని, వాటిని వెలిగించిన తర్వాత కార్పొరేటర్‌కు తిరిగి సమాచారం ఇవ్వాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు.

సబ్ కాంట్రాక్టర్‌కు ఇచ్చేసి...

జీవీఎంసీ నుంచి వీధిదీపాల నిర్వహణ కాంట్రాక్టు తీసుకున్న ఏజెన్సీ మరొకరికి సబ్‌కాంట్రాక్టు ఇవ్వడంతో పనులు సక్రమంగా సాగడం లేదు. 400 మంది సిబ్బందిని నియమించుకోవాల్సిన ఏజెన్సీ కేవలం 150 మందితోనే నెట్టుకొస్తోంది. దీనివల్ల పనితీరు మెరుగుపడకపోగా, తీసికట్టుగా మారింది. తాజాగా వీధిదీపాల నిర్వహణకు పార్ట్ బిల్లు జారీచేయాలంటూ కాంట్రాక్టరు కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు. దీంతో బిల్లు చెల్లింపునకు సిద్ధంగానే ఉన్నానని, అయితే సేవలు సంతృప్తిగా ఉన్నాయని అందరు కార్పొరేటర్ల నుంచి ఎన్ఓసీ తేవాలని షరతు విధించారు.

కాంట్రాక్టర్ల చుట్టూ ప్రదక్షిణలు

దీంతో ఉలికిపాటునకు గురైన కాంట్రాక్టర్ కార్పొరేటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు. ఇందుకోసం సబ్‌కాంట్రాక్ట్ ఇచ్చిన ఏజెన్సీ ద్వారా కార్పొరేటర్లను కలిసి విజ్ఞప్తి చేస్తున్నారు. వీధిదీపాల పనితీరు తీసికట్టుగా ఉందని, ప్రజలు నిలదీస్తున్నారని కొంతమంది కార్పొరేటర్లు ఎన్ఓసీ ఇవ్వడం లేదు. మరికొందరు మాత్రం దీపాలు వెలగకపోయినా ఎన్ఓసీలను ఇచ్చేస్తున్నట్టు సమాచారం.

విద్యార్థులకు బిగ్ రిలీఫ్

... 5వ పేజీ తరువాయి

విద్యార్థులు లోకేశ్ దృష్టికి తీసుకెళ్లడంతో అధికారంలోకి వస్తే పాత విధానం అమలు చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. అందుకు అనుగుణంగా సాంఘిక సంక్షేమశాఖ ఉత్తర్వులు విడుదల చేసింది. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించిన ఫీజులను నేరుగా కాలేజీ యాజమాన్యాలకు చెల్లిస్తామని పేర్కొంది. దీంతో జిల్లాలో డిగ్రీ, ఇంజనీరింగ్, ఫార్మసీ, ఐటీఐ, పాలిటెక్నిక్ వంటి అనేక కోర్సులు చదువుతున్న విద్యార్థులకు ఊరట కలిగింది.

ఇప్పటికే తీవ్ర స్థాయి ఒత్తిడి

ఈ విద్యా సంవత్సరం ప్రారంభమై నాలుగు నెలలు దాటుతున్నా ప్రభుత్వం నుంచి ఫీజు చెల్లింపులపై స్పష్టమైన మార్గదర్శకాలు రాకపోవడంతో అనేక కళాశాలల యాజమాన్యాలు తొలి రెండువిడతల ఫీజు చెల్లించాలంటూ విద్యార్థులపై ఒత్తిడి తెస్తున్నాయి. కొన్ని కాలేజీల యాజమాన్యాలు మొదటి విడత ఫీజు ముక్కుపిండి మరీ వసూలు చేశాయి. దీంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న విద్యార్థులు సతమతమవుతున్నారు. అయితే పరీక్షలకు హాజరకానివ్వమని, ల్యాబ్స్ రానీయమని కాలేజీలు బెదిరిస్తుండడంతో ఫీజులు చెల్లిస్తున్నారు. ఈ తరుణంలో ప్రభుత్వం నుంచి కీలక ఉత్తర్వులు విడుదల కావడం మేలు చేకూర్చింది. జిల్లాలో వివిధ కోర్సులు చదువుతున్న విద్యార్థుల సంఖ్య సుమారు 40 వేలు ఉంటుందని అధికారులు చెబుతున్నారు. వీరందరికీ తాజా నిర్ణయంతో ఉపశమనం కలుగనుంది. ప్రభుత్వమే కాలేజీలకు ఫీజులు చెల్లిస్తామంటూ ఉత్తర్వులు జారీచేసిన నేపథ్యంలో కాలేజీలు ఒత్తిడి చేసే వీలుండదు. ఎక్కడైనా ఇబ్బందులు ఎదురైతే సాంఘిక సంక్షేమశాఖ అధికారులకు ఫిర్యాదు చేయవచ్చని సూచించారు.

పెండింగ్ బకాయిల సంగతేంటి.?

గత వైసీపీ ప్రభుత్వం జిల్లాలోని విద్యార్థులకు సుమారు రూ.100 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ పెండింగ్‌లో పెట్టింది. ఈ చెల్లింపులపై కూటమి ప్రభుత్వం ఆలోచిస్తోందనిచెబుతున్నారు. 2023-24 విద్యా సంవత్సరానికి జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం మార్చిలో ఒక్క విడత సొమ్ము జమ చేసింది. మిగిలిన మూడు విడతలు పెండింగ్‌లో పెట్టింది. 2022-23 ఏడాదికి సంబంధించి ఒక విడత విద్యా దీవెన పెండింగ్‌లో ఉంది. ఈ డబ్బులను విద్యార్థులే కాలేజీలకు చెల్లించారు. ఈ అంశంలో ఎలాంటి నిర్ణయం తీసుకోవాలనే దానిపై ప్రస్తుత కూటమి ప్రభుత్వం అధికారులతో చర్చిస్తోందని చెబుతున్నారు.

భూ కబ్జాదారులపై ఉక్కుపాదం!

... 5వ పేజీ తరువాయి

భూముల పరిరక్షణకు ఒక విభాగం ఉండేది. డిప్యూటీ కలెక్టర్ ఆధ్వర్యంలో తహసీల్దారు, డిప్యూటీ తహసీల్దార్లు, పదిమంది ఆర్ఐలు, సర్వేయర్లు, సిబ్బంది ఉండేవారు. 1989 నుంచి 1994 వరకు జిల్లాలో 150 ల్యాండ్ గ్రాబింగ్ కేసులు పెట్టారు. వీటిలో కొన్ని ప్రభుత్వానికి అనుకూలంగా రాగా మరికొన్నింటి లో ఆక్రమణదారులకు శిక్ష పడింది. ఇంకొన్ని క్రమబద్ధీకరించారు. 1994 తరువాత ల్యాంగ్ గ్రాబింగ్ విభాగం నిర్వీర్యమవుతూ వచ్చింది. తరువాత నామమాత్రంగా మిగిలింది. 2000 తరువాతే నగరంలో పెద్దఎత్తున ఆక్రమణలకు దిగారు. నోటీసు ఇస్తే కోర్టుకు వెళ్లడం, అక్కడ కేసు పెండింగ్‌లో ఉండడంతో అధికారుల్లో నిరాశ అలముకుంది. ల్యాండ్ గ్రాబింగ్ విభాగం చివరకు ల్యాండ్ ప్రొటెక్షన్ విభాగంగా మారిపోయింది. సిబ్బందిని తహసీల్దారు కార్యాలయాలకు పంపేశారు. ప్రస్తుతం డిప్యూటీ కలెక్టర్, అటెండరు మాత్రమే మిగిలారు. ఇదిలావుండగా సీఎం చంద్రబాబునాయుడు తాజాగా భూఆక్రమణదారులపై ఉక్కుపాదం మోపుతామని ప్రకటించిన నేపథ్యంలో జిల్లాలో భూ పరిరక్షణ విభాగాన్ని పటిష్ఠంచేయాలని రిటైర్డు డిప్యూటీ కలెక్టర్ ఒకరు అభిప్రాయపడ్డారు. విశాఖ పరిసరాల్లో వేల కోట్ల భూములు ఆక్రమణలకు గురయ్యాయని, ఇప్పటికైనా చట్టం కఠినంగా అమలుచేస్తేనే ఫలితం ఉంటుందనే వాదన వినిపిస్తోంది. ముఖ్యంగా రెవెన్యూ శాఖలో అవినీతిని అడ్డుకునేలా చట్టంలో మార్పులు అవసరమని అభిప్రాయపడుతున్నారు.

వాల్తేరు రైల్వేలో బెడ్‌షీట్లు శుభ్రపరిచే వ్యవస్థ

విశాఖపట్నం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఏసీ కోచ్ ప్రయాణికులకు అందించే బెడ్ షీట్, పిల్లో కవర్, ఫేస్ టవల్, దుప్పటి (బ్లాంకెట్)ని వాల్తేరు డివిజన్‌లో ఏర్పాటు చేసిన అధునాతన నార ఉతికే యంత్రం ద్వారా శుభ్రపరుస్తామని రైల్వే అధికారులు తెలిపారు. తూర్పు కోస్తా రైల్వే ప్రస్తుతం 2,428 ఎల్‌హెచ్‌బి కోచ్‌లు, 938 ఐసీఎఫ్ కోచ్‌లతో రైళ్లను నడుపుతోందన్నారు. వీటిలో 1,327 ఏసీ, 1,101 నాన్ ఏసీ ఎల్‌హెచ్‌బి కోచ్‌లుండగా, ఐసీఎఫ్‌లో 239 ఏసీ, 699 నాన్ ఏసీ కోచ్‌లున్నాయని పేర్కొన్నారు. ఏసీ కోచ్‌లలో అందించే బెడ్ షీట్స్, ఫేస్ టవల్స్, దిండు కవర్లను ప్రతి ట్రిప్‌కి ఒకసారి అధునాతన నార ఉతికే వ్యవస్థతో శుభ్రపరుస్తారని, దుప్పట్లను డ్రై క్లీనింగ్ మిషన్ల ద్వారా నెలకు ఒకసారి శుభ్రం చేస్తారన్నారు. వాల్తేరు డివిజన్, విశాఖలో రోజుకు 17.9 టన్నుల బెడ్ షీట్స్, పిల్లో కవర్స్ ఫేస్ టవల్స్‌ను శుభ్రం చేసే సామర్థ్యం గల అధునాతన నార ఉతికే యంత్రాలు అందుబాటులో ఉన్నాయన్నారు.

☛ సంక్షిప్తంగా..

ఐఐఎం మెమోరియల్ అవార్డుకు రూ.5 లక్షల వితరణ



డైరెక్టర్‌కు చెక్కు అందిస్తున్న రావు

విశాఖపట్నం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం)లో దివంగత మోటపర్తి రామచంద్రమ్మ పేరుతో మెమోరియల్ అవార్డు అందించేందుకు వీలుగా అతని కుటుంబసభ్యులు రూ.5.25 లక్షలను అందించారు. ప్రముఖ పారిశ్రామికవేత్త, విద్యావేత్త మోటపర్తి రావు ఆమె తల్లి మోటపర్తి రామచంద్రమ్మ పేరుతో ఈ అవార్డు అందించేందుకు ఐఐఎం డైరెక్టర్ ప్రొఫెసర్ చంద్రశేఖర్‌కు చెక్కు అందించారు. ఎంబీఏ ఫైనాన్స్ అండ్ అకౌంటింగ్‌లో ప్రతిభ కనబర్చిన యువతికి ఈ మొత్తంపై వచ్చే వడ్డీని క్యాష్ అవార్డుగా, మెరిట్ సర్టిఫికెట్ అందిస్తారు.

ప్రభుత్వం దృష్టికి పెండింగ్ బిల్లులు

విశాఖపట్నం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సంక్షేమశాఖ హాస్టల్స్‌కు సంబంధించి పెండింగ్‌లో ఉన్న బిల్లుల వివరాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని సాంఘిక సంక్షేమశాఖ ఉప సంచాలకులు కె.రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. వసతి ఓకే.. ఆహారమే అన్న శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించారు. వసతి గృహాల్లో మెనూ అమలు సక్రమంగా జరుగుతోందన్నారు. గుడ్లు, రాగి జావ, చిక్కీలు అందించడంలో ఎక్కడా అలసత్వం లేదన్నారు.

వైసీపీ వల్లే ఏపీ సర్వనాశనం

ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్



సిరిపురం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఏపీని గత వైసీపీ ప్రభుత్వం సర్వనాశనం చేసిందని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు డా. కేఏ పాల్ విమర్శించారు. ఆదివారం సాయంత్రం జీవీఎంసీ ఎదురుగా డాక్టర్ కేఏ పాల్ ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో ఈవీఎంలు వద్దంటూ అనేకసార్లు చెప్పానని, అనేక దేశాలు బ్యాలెట్ పద్ధతినే అనుసరిస్తున్నాయన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా రావాలంటే అందరం కలిపి పోరాడాలని పిలుపునిచ్చారు. అన్ని పార్టీలు విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు తీవ్ర అన్యాయం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యల పరిష్కారానికి తనతో కలిసి ఎవరైనా పోరాటం చేయవచ్చన్నారు.

సినిమా గైడ్

● **మెకానిక్ రాఖీ:** మెలోడి, శరత్, కామేశ్వరి, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), లక్ష్మి (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), గణేష్ (తగరపువలస)
● **దేవకీనందన వాసుదేవ:** జగదాంబ, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), శ్రీరాములమ్మ (తగరపువలస)
● **జీబ్రా:** శారద, శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీనరసింహ (గోపాలపట్నం), నటరాజ్-2 (పెందుర్తి), తాతా (తగరపువలస)
● **కంగువా:** సంగం, రమాదేవి, శ్రీరామ, కామేశ్వరి, మౌర్య (గోపాలపట్నం), కన్య కాంప్లెక్స్ (గాజువాక)
● **లక్కీ భాస్కర్:** వెంకటేశ్వర
● **అమరన్:** శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 52, టమాటా 47, వంకాయలు (తెలుపు)32, వంకాయలు (నలుపు) 32, బెండకాయలు 26, పచ్చిమిర్చి 28, కాకరకాయలు 42, బీరకాయలు 38, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 30, క్యాబేజి 30, క్యారెట్ 56 దొండకాయలు 32, బంగాళ దుంపలు 34, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 82, అల్లం (పాతది)50, బరబాటి 32, ముల్లంగి 26, నిమ్మకాయలు (కిలో) 65, గోరుచిక్కుడు 28 దోస కాయలు 26, వెల్లుల్లి (పెద్దవి) 290, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 60, పొటల్స్ 50, కీర దోస 28, కాప్సికమ్ 44, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 44, చిలగడ దుంపలు 32, కంద 58, దేముడు చిక్కుడు 78, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 55, కొత్తిమీర (పెద్దకట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 45, మామిడి అల్లం 64, బొప్పాయి 40, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్)
(వంద - రూ.లలో)

విశాఖపట్నం	600
విజయనగరం	604
శ్రీకాకుళం	604

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	100
ఫారం ధర	120
విత్ స్కిన్	210
స్కిన్‌లెస్	220

బీఆర్టీఎస్ రోడ్డులో పార్కింగ్ పరేషాన్

» భారీ వాహనాలు నిలిపి వేస్తుండడంతో వాహనదారులకు తప్పని ఇబ్బందులు
» తరచూ రోడ్డు ప్రమాదాలు
» పట్టించుకోని అధికారులు, ట్రాఫిక్ పోలీసులు



పెదగదిలి సమీపం శాలిపేట వద్ద పార్కింగ్ చేసిన వాహనాలు

ఆరిలోవ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 13వ వార్డు పరిధిలోని శ్రీకాంత్‌నగర్ డబుల్ రోడ్డులో పలు వాహనాలు పార్కింగ్ చేస్తుండడంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించే వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇక్కడ ట్రక్ పార్కింగ్ తరహాలో భారీ వాహనాలను నిలిపి వేస్తున్నారు. టూరిస్టు బస్సులు అడ్డదిడ్డంగా పార్కింగ్ చేస్తున్నారు. ఈ రోడ్డులో రోజూ వందలాది వాహనాల తిరుగుతుంటాయి. అయితే డబుల్ రోడ్డులో రెండు వైపులా భారీ వాహనాలు పార్కింగ్ చేయడంతో ఈ మార్గం ఇరుకుగా తయారై రాకపోకలకు ఇబ్బందిగా మారుతోందని వాహనదారులు వాపోతున్నారు. ఇరుకు రోడ్డులో వెళ్లడం వల్ల వాహనాల రద్దీ ఎక్కువగా ఉన్నప్పుడు రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, దీని వల్ల గాయాల పాలవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ట్రాఫిక్ పోలీసులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

అలాగే పెదగదిలి బీఆర్‌టీఎస్ రోడ్డు కూడా భారీ వాహనాలు నిలిపి వేస్తున్నారని, ఇక్కడ రాత్రీ పగలు తేడా లేకుండా భారీ వాహనాలు పార్కింగ్ చేసేందుకు వస్తుంటాయని స్థానికులు అంటున్నారు. కొందరు స్థానికులు తమ వ్యాపార వాహనాలను రోడ్డు పక్కనే నిలిపి వేస్తున్నారు. దీనివల్ల తరచూ ప్రమాదాలకు గురవుతున్నామని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొండవాలు ప్రాంతం కావడంతో అధికారులు, ట్రాఫిక్ పోలీసులు ఇటు వైపు పెద్దగా దృష్టి పెట్టడం లేదని, దీంతో అంతకంతకూ ఇక్కడ భారీ వాహనాల పార్కింగ్ పెరిగిపోతోందని అంటున్నారు. ఈ ప్రాంతంలో రోడ్డు విశాలంగా ఉన్నప్పటికీ లెక్కకు మించి భారీ వాహనాలు నిలిపి వేస్తుండడం సమస్యగా మారుతోందని వాపోతున్నారు. కొన్నిసార్లు భారీ వాహనాలను రాత్ర వేళల్లో నిలిపేందుకు తీసుకువస్తుండడంతో ఆ వేళలో వచ్చే వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని చెబుతున్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు ఈ సమస్యపై దృష్టి సారించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.



శ్రీకాంత్‌నగర్ బీఆర్‌టీఎస్ రోడ్డులో నిలిపిన వాహనాలు



రోడ్డుకు ఆనుకొని పార్కింగ్ చేసిన వాణిజ్య వాహనాలు

ఘనంగా గంటా పుట్టినరోజు వేడుకలు



జన్మదినం సందర్భంగా ఎమ్మెల్యే గంటాను సత్కరించి శుభాకాంక్షలు తెలియజేస్తున్న చరణ్ గ్రూప్ అధినేత పరంధామనాయుడు (బాబు)

విశాఖపట్నం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పుట్టినరోజు వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఎంవీపీ కాలనీలోని ఆయన స్వగృహంలో సింహాచలం దేవస్థానం ప్రధాన పురోహితుడు గొడవర్తి శ్రీనివాసాచార్యుల నేతృత్వంలో వైదుకులు వేదాశీర్వచనం చేశారు. దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ వేంద్ర త్రినాథరావు కండువా వేసి నృసింహస్వామివారి చిత్రపటాన్ని ప్రసాదాన్ని అందజేశారు. సాగర్‌నగర్‌లోని మొగధారమ్మ ఆలయంలో గంటా ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రుషికొండ వెంకటేశ్వరస్వామి ఆలయాన్ని దర్శించుకుని వేదాశీర్వచనం తీసుకున్నారు. ఆలయంలో భక్తుల సౌకర్యాల కల్పనకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అధికారులకు సూచించారు. గంటా ఇంటి వద్ద కార్యకర్తలు, అభిమానుల తాకిడితో కోలాహలంగా మారింది. భీమిలి, విశాఖ సిటీ, పాయకరావుపేట, చోడవరం, అనకాపల్లి తదితర ప్రాంతాల నుంచి అభిమానులు తరలి వచ్చారు. టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు, అభిమానుల సమక్షంలో గంటా కట్ చేశారు. గంటాకు మంత్రి కొండపల్లి శ్రీనివాస్, వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్, ఏపీ అర్బన్ ఫైనాన్స్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ తదితరులు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు.



గంటాకు కండువావేసి స్వామి చిత్రపటాన్ని అందిస్తున్న సింహాచలం ఈవో త్రినాథరావు

భక్తిశ్రద్ధలతో అమావాస్య పూజలు



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

వెంకోజీపాలెం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : అమావాస్యను పురస్కరించుకుని కొత్త వెంకోజీపాలెంలోని గౌరీ జ్ఞానలింగేశ్వరాలయంలో వేంచేసి ఉన్న కాలభైరవ స్వామికి ఆదివారం భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసిన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ప్రకాష్ శర్మ, సుబ్రహ్మణ్యశాస్త్రి, భాస్కర్‌శర్మల ఆధ్వర్యంలో అభిషేకాలు, అర్చనలు జరిపారు. కార్యక్రమంలో గ్రామ సేవా సంఘం మాజీ అధ్యక్షుడు డాక్టర్ బోర వెంకట రమణారెడ్డి, మద్దాల వీర వెంకటఅప్పారావు, బోర ఎర్రాజీరెడ్డి, ఎస్.నరసింహారెడ్డి, భక్తులు, అయ్యప్ప మాలదారులు అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

దీపారాధనకు విస్తృత ఏర్పాట్లు



దీపారాధన కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక కొలను

వెంకోజీపాలెం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి) : గత నెల రోజులపాటు భక్తిశ్రద్ధలతో శివనామస్మరణంతో నిర్వహించిన కార్తీక మాసోత్సవాలు సోమవారంతో ముగియనున్నాయి. ఈ సందర్భంగా మహిళలు భక్తిశ్రద్ధలతో నెలంతా చేసిన 1001, 501, 108 ఒత్తులను ఆలయాల వద్ద ఏర్పాటు చేసిన కొలనులో అరటి డొప్పలపై ఉంచి వదులుతారు. ఈ క్రమంలో మహిళలు దీపాలను విడిచి పెట్టేందుకు పాత వెంకోజీపాలెంలోని శ్రీ సీతారామ సేవా సంఘం ఆధ్వర్యంలో ఇక్కడి రామాలయం ఆవరణలో ప్రత్యేకంగా కొలనును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షులు ఆడారి పరదేశినాయుడు మాట్లాడుతూ మహిళలు దీపాలను వదులుకునేందుకు నగరంలో పెద్ద పెద్ద మంచినీటి కాలువలు అందుబాటులో లేకపోవడంతో వారికి కాస్తంత వెసులుబాటు కలిగించేందుకు ఈ ప్రత్యేక కొలనును ఏర్పాటు చేశామన్నారు.

క్రెడాయ్ ప్రాపర్టీ షోతో ట్రాఫిక్ అవస్థలు

» రోడ్డుపైనే వాహనాల పార్కింగ్‌తో సమస్యలు » వాహనదారులు, ప్రజల నరక యాతన



ఎక్స్‌పో నిర్వహించిన గాదిరాజు ప్యాలెస్ వద్ద నిలిచిపోయిన ట్రాఫిక్

విశాఖపట్నం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : క్రెడాయ్ ఆధ్వర్యంలో గాదిరాజు ప్యాలెస్‌లో నిర్వహిస్తున్న ప్రాపర్టీ షో వల్ల వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది. రెండు రోజులుగా ఇక్కడ ప్రాపర్టీ షో నిర్వహిస్తున్నారు. ఈ షోకు నగర పరిధిలోని అనేక ప్రాంతాల ప్రజలు వచ్చారు. వీరు తమ వాహనాలను ప్యాలెస్ బయట ఉన్న ఫుట్‌పాత్‌తోపాటు రోడ్డుపైనే పార్కింగ్ చేశారు. దీనివల్ల రాకపోకలు సాగించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది. ప్యాలెస్ ఎదురుగా ఉన్న ఫుట్‌పాత్‌పై బైకులు పార్కింగ్ చేయగా, రోడ్డుపైనే చాలా మంది కార్లు నిలిపివేసి వెళ్లిపోయారు. గాదిరాజు ప్యాలెస్‌కు ఇటు, అటు వంద మీటర్లు వరకు దారి వెంబడి కార్లు పార్క్ చేసి వాహనదారులు వెళ్లిపోవడంతో ఈ మార్గంలో ప్రయాణాలు సాగించిన వాహనదారులకు ఇబ్బందులు తప్పలేదు. ఆదివారం కావడంతో ప్రయాణికుల సంఖ్య అధికంగా ఉంది. దీంతో వారంతా ఇబ్బందులు పడ్డారు. వాహనాలు ముందుకు కదలడానికి కూడా ఇబ్బంది ఏర్పడింది. రోడ్డుపై ఎక్కడ వాహనం పార్క్ చేసినా హడావిడి చేసే పోలీసులు ఇక్కడ రోడ్డు మొత్తం వాహనాలతో నింపేసినా పట్టించుకోలేదని, ట్రాఫిక్ అంతరాయం ఏర్పడినా చూడలేదని పలువురు వాహనదారులు వాపోయారు.

ముగిసిన క్రెడాయ్ ఎక్స్‌పో

ఎంవీపీ కాలనీ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ నిర్ణయాలు నిర్మాణ రంగాన్ని బలోపేతం చేసే విధంగా ఉంటాయని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. ఎంవీపీ కాలనీలోని గాదిరాజు ప్యాలెస్‌లో మూడు రోజులుగా జరుగుతున్న క్రెడాయ్ ఎక్స్‌పో ముగింపు సభలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ వేగవంతంగా నిర్మాణాలు చేపట్టేందుకు సింగిల్ విండో సిస్టమ్ ద్వారా ఆమోదం వంటివి మరింత ఊతమిస్తాయన్నారు. నగరంలో భూ ఆక్రమణల నిరోధానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు మాట్లాడుతూ ఇలాంటి ఎక్స్‌పో ప్రదర్శనలు నిర్మాణదారులకు ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. క్రెడాయ్ చైర్మన్ రాజు, అధ్యక్షుడు ధర్మేందర్, గౌరవ కార్యదర్శి శ్రీను, తదితరులు ప్రసంగించారు.



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న హోంమంత్రి అనిత తదితరులు

సందడిగా జేఎన్‌టీయూ (కె) 'ఇకోసాక్ వైజాగ్'

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న జేఎన్‌టీయూ పూర్వ విద్యార్థులు

ఎంవీపీ కాలనీ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : జేఎన్టీయూ (కాకినాడ) ఇంజనీరింగ్ కళాశాలలో విద్యాభ్యాసం చేసిన విద్యార్థులు 'ఇకోసాక్ వైజాగ్' పేరిట పూర్వ విద్యార్థుల సమావేశాన్ని ఆదివారం ఎంవీపీ కాలనీలోని ఐఐఎం బిజినెస్ స్కూలు ఆవరణలో నిర్వహించారు. విద్యార్థులతో నాటి అనుభవాలను పంచుకున్నారు. 220 మంది పూర్వ విద్యార్థులు హాజరైన ఈ సమావేశం అనంతరం మ్యూజికల్ చైర్స్, హౌసీ వంటి కార్యక్రమాలతో సాయంత్రం వరకూ సందడిగా గడిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా జేఎన్టీయూ (కాకినాడ) వీసీ ప్రొఫెసర్ కేవీఎస్జీ మురళీకృష్ణ విచ్చేశారు. గౌరవ అతిథిగా సింగరేణి కోల్ కంపెనీ లిమిటెడ్ డైరెక్టర్ సత్యనారాయణ, విశిష్ట అతిథులుగా ఏఎస్ఎన్ ప్రసాద్, డాక్టర్ ఓఆర్ఎం రావు, కె.రమేష్ పాల్గొన్నారు.

12వ వార్డులో టీడీపీ సభ్యత్వ నమోదు



సభ్యత్వాలను నమోదు చేస్తున్న సత్యం, సంతోష్ తదితరులు

ఆరిలోవ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 12వ వార్డులో గల పెదగదిలి కొండవాలు ప్రాంతంలోఆదివారం టీడీపీ సభ్యత్వ నమోదు చేపట్టారు. టీడీపీ వార్డు అధ్యక్షుడు గాడి సత్యం నేతృత్వంలో బూత్ కన్వీనర్ దువ్వి సంతోష్ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా సత్యం మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీలో సభ్యత్వం తీసుకోవడం వల్ల ఓ మంచి పార్టీలో చేరి సమాజాభివృద్ధిలో భాగస్వామ్యం అయ్యే అవకాశం లభిస్తుందన్నారు. అలాగే బీమా సౌకర్యం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు పాత్రేరు శేషగిరి, నక్కన శివ, జి.సత్తిబాబు తదతరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం

మద్దిలపాలెం, డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి) : డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆదివారం విశాఖ జిల్లా ప్రభుత్వ కళాశాల అధ్యాపకుల సంఘం (జీసీటీఏ) నూతన కార్యవర్గ ఎన్నికలు నిర్వహించారు. సంఘం అధ్యక్షుడుగా కర్రి రామారావు, ప్రధాన కార్యదర్శిగా మామిడి గోపి, కోశాధికారిగా ఎ.జ్యోతి, మహిళా కార్యదర్శిగా కె.అరుణపద్మ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి నిరంతరం పనిచేస్తామని పేర్కొన్నారు.

తుపాన్ ఎఫెక్ట్ : జూకు తగ్గిన సందర్శకులు

ఆరిలోవ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఫెంగల్ తుపాను దెబ్బకు జంతు ప్రదర్శన శాలకు వచ్చే సందర్శకుల తాకిడి తగ్గింది. కార్తీక మాసం కావడంతో ప్రతి ఆదివారం జూకు సందర్శకులు అధిక సంఖ్యలో వచ్చేశారు. ఈ ఆదివారం మాత్రం ఈ సంఖ్య రెండు వేల ఐదు వందల 97 మందికి పరిమితమైంది. వీరి నుంచి రూ.2 లక్షల 18 వేల రూపాయల ఆదాయం సమకూరినట్టు జూ క్యూరేటర్ మంగమ్మ వెల్లడించారు. గత ఆదివారం సందర్శకుల నుంచి రూ.లక్షల ఆదాయం సమకూరింది. తుపాను కారణంగా ముసురు నెలకొని వర్షం పడడంతో సందర్శకులు పెద్దగా జూకు రాలేదు.

అలాగే జూకు ఎదురుగా ఉన్న కంబాలకొండకు కూడా సందర్శకులు పెద్దగా రాలేదు. కేవలం వంద మంది వరకూ సందర్శకులు వచ్చారు. వీరి నుంచి రూ.5 వేల ఆదాయం సమకూరిందని కంబాలకొండ సిబ్బందితెలిపారు.

వాతావరణ మార్పులపై రోడ్డుపై పెయింటింగ్



రోడ్డుపై పెయింటింగ్ వేస్తున్న విద్యార్థులు



విశాఖపట్నం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : 'వాతావరణ మార్పులు'పై నగరానికి చెందిన ప్రొగ్రెసివ్ ఆర్టిస్ట్స్ లీగ్ ఆదివారం బీచ్‌రోడ్‌లో పిల్లలతో సృజనాత్మక కార్యక్రమాన్ని నిర్వహించింది. కార్యక్రమంలో పాల్గొన్న వారంతా రోడ్‌పై చిత్రలేఖనం ద్వారా క్లైమేట్ ఛేంజ్ గురించి తమ అభిప్రాయాలను వెలిబుచ్చారు. క్లైమేట్ ఛేంజ్- హ్యూమన్ లైవ్స్ ఆర్ ప్రైవేట్ ప్రాఫిట్స్ అన్న నినాదాలను బీచ్‌రోడ్‌పై రాశారు. వాతావరణం కాలుష్యానికి కారణమవుతున్న బహుళజాతి సంస్థలు, వాటికి మద్దతుగా నిలబడుతున్న ప్రభుత్వాల పనితీరుపై ప్రజలు తెలుసుకోవాలని ప్రొగ్రెసివ్ ఆర్టిస్ట్స్ లీగ్ కోరింది. సంస్థ ప్రతినిధి అజయ్‌తోపాటు పలువురు విద్యార్థులు, సభ్యులు పాల్గొన్నారు.

రెవెన్యూ అసోసియేషన్ నూతన కార్యవర్గం



భీమిలి రెవెన్యూ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు

విశాఖపట్నం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఏపీ రెవెన్యూ అసోసియేషన్ భీమిలి డివిజన్‌కు కొత్త కార్యవర్గం ఎన్నిక ఆదివారం ఏకగ్రీవంగా జరిగింది. అధ్యక్షునిగా ఆనందపురం డీటీ ఎల్.చేతన్‌కుమార్, అసోసియేట్ అధ్యక్షునిగా భీమిలి డీటీ కె.సుధాకర్, ఉపాధ్యక్షులుగా ఎ. వెంకటేష్ (భీమిలి ఆర్డీవో కార్యాలయం), ఎల్.లోకేశ్ (ఆనందపురం తహసీల్దారు కార్యాలయం), డి.శ్యామల (పద్మనాభం తహసీల్దారు కార్యాలయం), కార్యదర్శిగా పద్మనాభం డీటీ సీహెచ్. రవికుమార్, సంయుక్త కార్యదర్శులుగా టి.మల్లేశ్వరరావు, ఏవీ కిశోర్ (విశాఖ రూరల్), ముస్తాపా(ఆనందపురం), కోశాధికారిగా ఎస్‌కే. అబ్రహం (సీతమ్మధార), కార్యవర్గ సభ్యులుగా టి.రామచంద్, పి.జ్ఞానదీప్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. విశాఖ సిటీ అధ్యక్షుడు బీవీఎస్ నియోగి, జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్ఎం జిలాని ఎన్నికలు నిర్వహించారు.

సాగర తీరంలో ఉత్సాహంగా మారథాన్



మారథాన్‌లో పాల్గొన్న విదేశీయులు

రామ్‌నగర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : సాగరతీరంలో వైజాగ్ రన్నర్స్ సొసైటీ ఆధ్వర్యంలో సంధ్యమెరైన్స్ వైజాగ్ మారథాన్ నిర్వహించారు. ఆదివారం విశాఖ సాగరం తీరంలో వైజాగ్ మారథాన్ 21కె, 10కె, 5కె, 3కెను నిర్వహించారు. విశాఖ నగరవాసులతో పాటు దేశం నలుమూలల నుంచి వచ్చిన ఔత్సాహికులు వేల సంఖ్యలో వచ్చి ఉత్సాహంగా పరుగులో పాల్గొన్నారు. ఉదయం 4 గంటల నుంచి 9 గంటల వరకు మారథాన్ సాగింది. 21కె పురుషుల విభాగంలో వేదవ్యాస్, మహిళల విభాగంలో నవ్య, 10కెలో యోగేంద్ర, గ్రేస్ లు విజేతలుగా నిలిచారు వైజాగ్ రన్నర్స్ సొసైటీ అధ్యక్షుడు బాలకృష్ణారాయ్ చేతులు మీదుగా విజేతలకు రూ.ఐదు లక్షలకు పైగా నగదు పురస్కారాలు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సంధ్య మెరైన్స్ అధినేత కె.ఆనంద్, అతిథులురాజేష్ వెచ్చా, షాలినీ మీనన్, రామచంద్ర, మావూరి వెంకటరమణ పాల్గొన్నారు.

ఏ ఒక్కరూ ఎయిడ్స్ బారిన పడకూడదు : కలెక్టర్



ఎయిడ్స్ నివారణపై పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్, ఇతర అధికారులు

మహారాణిపేట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): హెచ్ఐవీ సోకిన వారిని ఎలాంటి వివక్ష లేకుండా సమాజంలో కలుపుకుపోవటమే ధ్యేయంగా ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినం సందర్భంగా ఆదివారం ప్రభుత్వ శాఖలు, ప్రభుత్వేతర సంస్థలు, నర్సింగ్ విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల కార్యకర్తలు సంయుక్తంగా ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ కలెక్టర్ కార్యాలయం నుంచి ఆంధ్ర వైద్య కళాశాల వరకు కొనసాగి అక్కడ మానవహారంగా ఏర్పడి విద్యార్థులు నినాదాలు చేశారు. సాంస్కృతిక ప్రదర్శన నిర్వహించారు. ఈ ఏడాది 'హక్కుల మార్గాన్ని అనుసరించండి.. నా ఆరోగ్యం-నా హక్కు' అన్న ఆశయంతో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. ఏ ఒక్కరూ హెచ్ఐవీ బారిన పడకుండా చేయటమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. జిల్లాలో ఎయిడ్స్ నివారణకు చేపడుతున్న చర్యలు, కార్యక్రమాలు, వివిధ సంస్థలు అందిస్తున్న సేవలను గణాంక సహితంగా వివరించారు. అధిక రక్తపోటు, చక్కెర వ్యాధి, వివిధ రుగ్మతలకు అందిస్తున్న సేవలకు సంబంధించిన గోడప్రతులను ఆవిష్కరించారు. బీచ్‌రోడ్డులో ఆంధ్ర వైద్య కళాశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ సేవలు అందించించిన వారికి ప్రశంసాపత్రాలను అందించారు. డీఎల్ఎస్ఏ ఎంవీ శేషమ్మ, జిల్లా వైద్యాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్, ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజు, డాక్టర్ కృష్ణవేణి, మాధవీలత పాల్గొన్నారు.

15న కార్తీక వన సమారాధన

వెంకోజీపాలెం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ పరిధిలోని 15వ వార్డు పాత వెంకోజీపాలెం శ్రీసీతారామ సేవా సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 15న వన సమారాధన (పిక్నిక్)ను నిర్వహించనున్నట్టు సంఘం అధ్యక్షులు ఆడారి పరదేశినాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతీ ఏటా నిర్వహించే విధంగా ఈ ఏడాది గ్రామస్థులంతా ఒక చోట చేరి సరదాగా గడిపేందుకు ఈ పిక్నిక్‌ను కంబాల కొండలో నిర్వహించనున్నట్టు ఆయన పేర్కొన్నారు. గ్రామంలోని చిన్నాపెద్దలంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.